

జై భీమ

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా


Jai Bheem STRUGGLE FOR JUSTICE TV

సామాన్యుడి ఆయుధంగా



సంపుటి - 07 | సంచిక 343 | ఎడిటర్ : బరిగెల శివ | శనివారం 14, నవంబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్









- లక్షలాది జీతాలు పుచ్చుకుంటున్న అధికారులకు సకల సౌకర్యాలు
- సాధారణ ఉద్యోగులకు తప్పని కష్టాలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు
- పిఆర్సి లబ్ధిదారులంతా ఉన్నత ఉద్యోగులే
- చిన్నపాటి ఉద్యోగులకు జీతాలే సరిపోవటం లేదు
- ఉద్యోగుల హక్కులను హరించి వేయొద్దు
- ప్రభుత్వానికి హార్దిక భారమైన... ఉద్యోగుల హామీలను నెరవేర్చాలి
- గత ప్రభుత్వం పిఆర్సిని చాలాకాలం ఆపింది
- పిఆర్సి కమిటీ హార్దిక లెక్కలను తేల్చేనా.!
- జనవరిలో పిఆర్సి ప్రకటిస్తామన్న ప్రభుత్వం మాట నిలబెట్టుకునేనా
- డాక్టర్ బరిగెల శివ

సామాన్య ఉద్యోగులకు.. సర్వ కష్టాలు !

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థిక కష్టాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. నిత్యావసర ధరల పెరుగుదలతో చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకోవడం కిందిస్థాయి ఉద్యోగులకు భారంగా మారింది. లక్షలాది రూపాయల వేతనాలు పొందుతున్న ఉన్నతాధికారులకు సకల సౌకర్యాలు కల్పిస్తుండగా, సాధారణ ఉద్యోగుల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. పీఆర్సీ అమలుపై ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటికీ ఆచరణకు నోచుకోకపోవడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు, పార్ట్‌టైమ్ ఉద్యోగుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. విశ్రాంత ఉద్యోగులకు అందాల్సిన పెన్షన్ బకాయిలు, పదవీ విరమణ ప్రయోజకాలు కూడా నిలిచిపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జనవరిలో పీఆర్సీ ప్రకటిస్తామన్న ప్రభుత్వ హామీని నిలబెట్టుకొని, ఉద్యోగుల హక్కులను కాపాడాలని డాక్టర్ బరిగెల శివ ప్రభుత్వాన్ని కోరారు.

- హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

వివరాలు 3లో

పెట్టుబడులకు తెలంగాణ అనుకూలం: సీఎం రేవంత్

ప్రపంచానికి తెలంగాణ సామర్థ్యాన్ని చాటేందుకే భారత్ సమ్మిట్

70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధుల హాజరు

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

దేశంలోనే అత్యుత్తమ గిగ్ వర్కర్స్ పాలసీని తీసుకొచ్చాం

సమ్మిట్‌పై దుష్ప్రచారం చేయొద్దని సీఎం విజ్ఞప్తి



2

స్పా సెంటర్ల ముసుగులో అసాంఘిక కార్యకలాపాల దందా!

హైదరాబాద్‌లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న వందలాది స్పాలు..

నాలుగు పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ఏం జరుగుతోంది?

ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో మామూళ్ల ఆరోపణలు..

పేపర్‌లో వార్త వస్తేనే అధికారుల హడావుడి!

2



అసోంలో ఘోర ప్రమాదం.. 23 మంది మృతి

కజిరంగా సమీపంలో మినీ బస్సు, కంటైనర్ ట్రక్కు ఢీ



మృతుల్లో అధికంగా కళాశాల, పాఠశాల విద్యార్థులే

ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలు.. ఆసుపత్రులకు తరలింపు

అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసుల ప్రాథమిక అంచనా

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం ఆదేశం

- మిగతా 2లో..

హైదరాబాద్ సీపీగా మహేశ్ భగవత్

పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ ఐపీఎస్ అధికారి

శాంతిభద్రతలు, మహిళా భద్రతకు తొలి ప్రాధాన్యం

ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

భూ తగాదాలు, దాడులపై కఠిన చర్యలు

వరుస నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ ప్రయోగం



2

జై భీమ్ తెలుగు దినపత్రిక
సమస్యలపై సమరంగా
POWER OF PEOPLE
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

పెట్టుబడులకు తెలంగాణ అనుకూలం: సీఎం రేవంత్

ప్రపంచానికి తెలంగాణ సామర్థ్యాన్ని చాటేందుకే భారత్ సమ్మిట్
70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధుల హాజరు
డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్
దేశంలోనే అత్యుత్తమ గిగ్ వర్కర్స్ పాలసీని తీసుకొచ్చాం
సమ్మిట్‌పై దుష్ప్రచారం చేయొద్దని సీఎం విజ్ఞప్తి

హైదరాబాద్, నవంబర్ 13 (జై భీమ్ న్యూస్) :

తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం, మెరుగైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని ప్రపంచ దేశాలకు చాటిచెప్పేందుకే రాష్ట్ర ప్రభుత్వం భారత్ సమ్మిట్ నిర్వహిస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లో రెండు రోజులపాటు జరుగుతున్న ఈ సదస్సులో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ తదితరులతో కలిసి బోధి పెవిలియన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026కు ముందు రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, అనుకూల పరిస్థితులను అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేయడమే భారత్ సమ్మిట్ ప్రధాన ఉద్దేశమని వివరించారు. గతేడాది కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని, ఈసారి సుమారు 70 దేశాల నుంచి వివిధ రంగాలకు చెందిన మంత్రులు, పర్యావరణవేత్తలు, పెట్టుబడిదారులు, జర్నలిస్టులు సహా దాదాపు వెయ్యి మంది ప్రతినిధులను ఆహ్వానించినట్లు తెలిపారు. రెండు రోజులపాటు పర్యావరణం, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, మానవ వనరులు, వాతావరణ మార్పులు తదితర అంశాలపై చర్చలు, సదస్సులు నిర్వహించి తెలంగాణలోని ప్రజాస్వామిక, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని ప్రపంచానికి తెలియజేస్తామని చెప్పారు. ఈ సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులంతా భవిష్యత్తులో తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారతారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మరోవైపు గిగ్ వర్కర్లు, ప్లాట్‌ఫామ్ కార్మికులు, కొరియర్లు, డ్రైవర్లు, గృహ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి దేశంలోనే అత్యుత్తమ గిగ్ వర్కర్స్ పాలసీని తమ ప్రభుత్వం రూపొందించిందని వెల్లడించారు. ఈ పాలసీ ఆవిష్కరణ కార్యక్రమానికి లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఆహ్వానించామని, భారత్ సమ్మిట్‌లోనూ ఆయన సందేశం వినిపిస్తారని తెలిపారు. ఢిల్లీలో నిర్వహించిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను ఆహ్వానించిన విషయాన్ని గుర్తుచేశారు. గతంలో ప్రధానిగా ఉన్న రాజీవ్ గాంధీ, ప్రతిపక్ష నేత అటల్ బిహారీ వాజ్‌పేయిని దేశ ప్రతినిధిగా విదేశాలకు పంపిన సందర్భాన్ని కూడా ప్రస్తావించారు. ఇలాంటి సమ్మిట్‌లను గుడ్డిగా వ్యతిరేకించడం, అర్థరహిత ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం సమర్థనీయం కాదని సీఎం పేర్కొన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం, రాష్ట్ర సాంస్కృతిక, సాంకేతిక ప్రగతిని అంతర్జాతీయ వేదికపై పరిచయం చేసి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే ఈ కార్యక్రమాల వెనుక ఉన్న ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు అడ్డుపడకుండా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్ సీపీగా మహేశ్ భగవత్

పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ ఐపీఎస్ అధికారి
శాంతిభద్రతలు, మహిళా భద్రతకు తొలి ప్రాధాన్యం
వరుస నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ ప్రయోగం

హైదరాబాద్, నవంబర్ 13 (జై భీమ్ న్యూస్) :

హైదరాబాద్ నగర నూతన పోలీస్ కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి మహేశ్ భగవత్ బాధ్యతలు స్వీకరించారు. నగర పోలీస్ కమిషనరేట్‌లోని తన ఛాంబర్‌లో సంబంధిత ఫైళ్లపై సంతకాలు చేసి అధికారికంగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తనకు కీలక బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల భద్రత, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ప్రతి ఏటా రోడ్డు ప్రమాదాల్లో సుమారు 1.80 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొంటూ, రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. నగరంలో భూముల విలువలు పెరుగుతున్న నేపథ్యంలో భూ వివాదాలు, వాటికి సంబంధించిన దాడులు చోటుచేసుకుంటున్నాయని, ఇలాంటి ఘటనలను ఉపేక్షించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పదేపదే నేరాలకు పాల్పడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే నేరగాళ్లపై అవసరాన్ని బట్టి పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని స్పష్టం చేశారు. సైబర్ నేరాల నియంత్రణకు మరింత పటిష్ఠమైన చర్యలు చేపట్టడంతో పాటు డయల్ 100, 112 అత్యవసర సేవలను బలోపేతం చేస్తామని తెలిపారు. నగరంలో పోలీసుల నిరంతర నిఘా ఉండేలా విజిబుల్ పోలీసింగ్‌ను విస్తృతం చేయడంతో పాటు ప్రజల భాగస్వామ్యంతో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను మరింత సమర్థంగా అమలు చేస్తామని నూతన పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్ వెల్లడించారు.

అసోంలో ఘోర ప్రమాదం.. 23 మంది మృతి

అస్సోం, నవంబర్ 13 (జై భీమ్ న్యూస్) :

అసోంలోని కజిరంగా సమీపంలో జాతీయ రహదారి 715పై ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. బొకాఖాట్ నుంచి నాగావ్‌కు వెళ్తున్న మినీ బస్సును రంగాజన్ వద్ద ఎదురుగా వేగంగా వచ్చిన కంటైనర్ ట్రక్కు బలంగా ఢీకొట్టడంతో 23 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ మంది కళాశాల, కజిరంగా హైస్కూల్ విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. ప్రమాద తీవ్రతకు మినీ బస్సు పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో ప్రయాణికులు వాహనం లోపల చిక్కుకుపోయారు. వెంటనే స్పందించిన స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టి మృతదేహాలను బయటకు తీశారు. గాయపడిన వారిని కోహోరా మోడల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉన్న క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం జోర్హాట్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రికి తరలించారు. నేషనల్ పార్క్ పరిసరాల్లో అమలులో ఉన్న వేగ పరిమితులను ఉల్లంఘించి మినీ బస్సు అతివేగంగా ప్రయాణించడమే ఈ ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘోర ప్రమాదంపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సహాయక చర్యలను పర్యవేక్షించాలని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అతుల్ బోరాను ఆదేశించారు. ప్రమాదంలో గాయపడిన వారందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

స్పా సెంటర్ల ముసుగులో అసాంఘిక కార్యకలాపాల దందా!

హైదరాబాద్‌లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న వందలాది స్పాలు..
నాలుగు పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ఏం జరుగుతోంది?
ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో మామూళ్ల ఆరోపణలు..
పేపర్‌లో వార్త వస్తేనే అధికారుల హడావుడి!

హైదరాబాద్(జై భీమ్ న్యూస్)

విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహానగరంలో స్పా సెంటర్ల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో వందలాది స్పా సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నేపథ్యంలో వాటి నిర్వహణ, అనుమతులు, కార్యకలాపాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెల్‌నెస్, మసాజ్, బాడీ థెరపీ, రిలాక్సేషన్ పేర్లతో ఏర్పాటు చేస్తున్న కొన్ని కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బయటకు స్పా సెంటర్లుగా కనిపిస్తున్న కొన్ని కేంద్రాల్లోకి వెళ్లిన తర్వాత వివిధ పేర్లతో అనేక రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారనే ఫిర్యాదులు, ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. అసలు అక్కడ ఏం జరుగుతోంది? చట్టబద్ధమైన సేవలే అందిస్తున్నారా? నిబంధనలకు విరుద్ధంగా ఏమైనా కార్యకలాపాలు కొనసాగుతున్నాయా? అనే అంశాలపై పోలీసు ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉంది. మరింత తీవ్రమైన ప్రశ్న ఏమిటంటే.. ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో స్పా సెంటర్ ఉన్నా స్థానిక పోలీసులకు ఆ కేంద్రాల నిర్వహణపై సమాచారం ఉండాల్సిందే. అయినప్పటికీ కొన్ని కేంద్రాలు నిరంతరంగా కొనసాగుతున్నాయంటే వాటిపై పర్యవేక్షణ ఎలా జరుగుతోంది? స్థానిక పోలీస్ స్టేషన్ల స్థాయిలో మామూళ్లు తీసుకుంటూ కొన్ని కేంద్రాల అక్రమ కార్యకలాపాలకు సహకరిస్తున్నారా? అనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవాలు ఉన్నాయా లేదా అన్నది ఉన్నతాధికారులు స్వతంత్రంగా విచారించి తేల్చాలి. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్ని స్పా కేంద్రాలు ఉన్నాయి? వాటికి అవసరమైన అనుమతులు ఉన్నాయా? ఇప్పటివరకు ఎన్ని తనిఖీలు నిర్వహించారు? ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? ఎన్ని కేసులు నమోదు చేశారు? అనే వివరాలను ప్రజలకు వెల్లడించాలి. మామూళ్లు తీసుకుంటూ అక్రమాలకు సహకరించినట్లు ఆధారాలు లభిస్తే సంబంధిత పోలీసు సిబ్బందిపైనా కఠిన చర్యలు తీసుకోవాలి. ఇంకా ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే.. పత్రికల్లో వార్తలు ప్రచురితమైనప్పుడు మాత్రమే కొందరు అధికారుల్లో హడావుడి కనిపిస్తోందనే విమర్శలు ఉన్నాయి. మీడియా కథనాలు వచ్చినప్పుడు ఆకస్మిక తనిఖీలు, ప్రకటనలు, ఫొటోలు.. ఆ తర్వాత మళ్లీ అంతా మామూలేనా? పేపర్‌లో వార్త వస్తేనే పోలీసులకు స్పా సెంటర్లు గుర్తుకొస్తాయా? మీడియా ప్రశ్నిస్తేనే అధికారులు మేల్కొంటారా? ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినప్పుడు స్పందించాల్సిన బాధ్యత లేదా? ఒకటి రెండు రోజులు తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకోవడం కాదు.. నిరంతర నిఘా, పర్యవేక్షణ అవసరం. ఉద్యోగాలు, ఉపాధి, ఆరోగ్య సేవల పేరుతో అమాయక ప్రజలు మోసపోతున్నారా? మహిళలు బలవంతంగా అక్రమ కార్యకలాపాల్లోకి నెట్టబడుతున్నారా? అనే అంశాలపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. ఎక్కడైనా బలవంతపు వ్యభిచారం, మానవ అక్రమ రవాణా, బెదిరింపులు లేదా దోపిడీ జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ నేపథ్యంలో రాష్ట్ర డీజీపీతో పాటు హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్లు వెంటనే స్పందించి నాలుగు కమిషనరేట్ల పరిధిలో ఏకకాలంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని స్పా కేంద్రాల పూర్తి వివరాలు సేకరించి, వాటి అనుమతులు, నిర్వహణ విధానాలు, సిబ్బంది భద్రత, చట్టపరమైన నిబంధనల అమలును పరిశీలించాలి. స్పా కేంద్రాల నిర్వాహకులు, స్థానిక పోలీసుల మధ్య ఏవైనా అక్రమ ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయనే ఆరోపణలపై కూడా విచారణ చేపట్టాలి. తప్పు చేసిన నిర్వాహకులే కాకుండా వారికి సహకరించినట్లు నిర్ధారణ అయిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలి. తనిఖీలు కేవలం పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడు మాత్రమే కాకుండా నిరంతరం కొనసాగాలి. వందలాది స్పా సెంటర్లు పుట్టుకొస్తున్నా పోలీసుల నిఘా ఎక్కడ? ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏం జరుగుతోంది? మామూళ్ల ఆరోపణలపై విచారణ ఎప్పుడు? పేపర్‌లో వార్త వస్తేనే అధికారుల హడావుడి ఎందుకు? అమాయక ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న వారిని ఎప్పుడు కట్టడి చేస్తారు? ఈ ప్రశ్నలకు పోలీసు ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది. హైదరాబాద్‌ను అక్రమ కార్యకలాపాలకు అడ్డాగా మారనివ్వకూడదు. ప్రజల భద్రత విషయంలో రాజీ పడకూడదు. అధికారుల హడావుడి కాదు.. నిరంతర చర్యలు కావాలి. మామూళ్ల ఆరోపణలకు సమాధానం కావాలి. అక్రమాలకు శాశ్వత అడ్డుకట్ట పడాలి!



రెగ్యులర్ నియామకాలకు ముందే కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి





కేయూలో చాక్‌డౌన్ నిర్వహించిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు.. రిజిస్ట్రార్‌కు వినతిపత్రం

హన్మకొండ, నవంబర్ 13(జై భీమ్ న్యూస్)

తమ సర్వీసులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు శుక్రవారం చాక్‌డౌన్ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. గత సంవత్సరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ఆయా విభాగాల్లో తరగతుల బోధనను నిలిపివేసి, అనంతరం కేయూ పరిపాలనా భవనం ఎదుట తమ డిమాండ్ల సాధన కోసం నినాదాలు చేశారు. అనంతరం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. రామచంద్రంతో కమిటీ హాల్‌లో సుమారు గంటన్నర పాటు సమావేశమై తమ సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. గత 30 ఏళ్లకు పైగా యూనివర్సిటీలో సేవలందిస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమ సర్వీసులు క్రమబద్ధీకరించబడతాయనే ఆశతో విధులు నిర్వహిస్తున్నారని, ఈ పరిస్థితుల్లో కొత్తగా రెగ్యులర్ నియామకాలు చేపట్టడం తమ భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యులర్ నియామకాలు చేపట్టేలోపే తమ సర్వీసులను క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రతతో పాటు యూజీసీ పే స్కేలు అమలు చేయాలని కోరారు. ఈ అంశాన్ని రానున్న పాలకమండలి సమావేశంలో ప్రత్యేక అజెండాగా చేర్చి చర్చించాలని రిజిస్ట్రార్‌ను విజ్ఞప్తి చేశారు. దీనిపై రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. రామచంద్రం స్పందిస్తూ వైస్ ఛాన్సలర్‌తో మాట్లాడి సమస్యల పరిష్కారానికి సంబంధించి చర్చిస్తానని హామీ ఇచ్చినట్లు అధ్యాపకులు తెలిపారు. ఈ సందర్భంగా కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ చైర్మన్ డా. పి. కరుణాకర్ రావు, జేఏసీ కన్వీనర్ సాధు రాజేష్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం ఇచ్చిన హామీని అమలు చేయడంతో పాటు రెగ్యులర్ రిక్రూట్‌మెంట్‌కు ముందే కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లందరినీ అబ్జార్ప్షన్ ద్వారా క్రమబద్ధీకరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే గతంలో మాదిరిగానే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని, ఉద్యోగ భద్రత లేకపోవడంతో అధ్యాపకులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని వారు పేర్కొన్నారు. అనారోగ్య సమస్యలు, గుండెపోటు వంటి కారణాలతో పలువురు కాంట్రాక్ట్ అధ్యాపకులు మృతిచెందుతున్నారని, వారి కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత యూనివర్సిటీ అధికార యంత్రాంగంపై ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలలు, విభాగాలకు చెందిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. బి. సతీష్, డా. బైరి నిరంజన్, డా. రంగారెడ్డి, డా. నాగేశ్వరరావు, డా. చంద్రశేఖర్, డా. సూర్యనారాయణ, డా. ఆరూరి సూర్యం, డా. కృష్ణయ్య, డా. ప్రసాద్, డా. స్వామి, డా. ప్రవీణ్, డా. టీ. నాగయ్య, సత్య, తూర్పాటి వెంకటేష్, డా. రాధిక, సాహితి, డా. ప్రణీత, డా. కవిత, డా. భాగ్య, డా. రమ, డా. బ్లెస్సి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

తోట్ల తండాలో టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి.. నాటుసారా స్వాధీనం

రూ.600 విలువైన 1.5 లీటర్ల నాటుసారా పట్టివేత..
9 వేల లీటర్ల బెల్లం, ఈస్ట్ మిశ్రమం ధ్వంసం

సంగెం, నవంబర్ 13 (జై భీమ్ న్యూస్)

వరంగల్ జిల్లా సంగెం మండలం తోట్ల తండాలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు ముడు వీరు నాయక్ (48)ను అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి సుమారు రూ.600 విలువైన 1.5 లీటర్ల నాటుసారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా నాటుసారా తయారీకి ఉపయోగిస్తున్న సుమారు 9 వేల లీటర్ల బెల్లం, ఈస్ట్ మిశ్రమాన్ని గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేశారు. నాటుసారా తయారీ, విక్రయాలపై నిఘా కొనసాగిస్తామని, అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

సామాన్య ఉద్యోగులకు సర్వ కష్టాలు

లక్షలాది జీతాలు పుచ్చుకుంటున్న
అధికారులకు సకల సౌకర్యాలు
సాధారణ ఉద్యోగులకు తప్పని కష్టాలు
ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు
పిఆర్సి లబ్ధిదారులంతా ఉన్నత ఉద్యోగులే
చిన్నపాటి ఉద్యోగులకు జీతాలే సరిపోవటం లేదు
ఉద్యోగుల హక్కులను హరించి వేయొద్దు
ప్రభుత్వానికి హార్దిక భారమైన... ఉద్యోగుల హామీలను నెరవేర్చాలి
గత ప్రభుత్వం పిఆర్సిని చాలాకాలం ఆపింది
పిఆర్సి కమిటీ హార్దిక లెక్కలను తేల్చేనా.!
జనవరిలో పిఆర్సి ప్రకటిస్తామన్న ప్రభుత్వం మాట నిలబెట్టుకునేనా : డాక్టర్ బరిగెల శివ



హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

సామాన్య ఉద్యోగుల జీవితాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉందని డాక్టర్ బరిగెల శివ గుర్తుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఉద్యోగులు సాధారణ జీవితాలను గడుపుతున్నారని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో పెరిగిపోయిన నిత్యవసరాలు ధరల దృష్ట్యా సామాన్య ఉద్యోగులకు సర్వ కష్టాలు ఎదురవుతున్నాయని చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాల పెరుగుదల ఎంతో ప్రామాణికంగా మారిపోయిందని అన్నారు. పిఆర్సి ప్రకటించడం వల్ల ఉద్యోగుల జీవితాలకు కొంతైనా భరోసా దొరుకుతుందని భావిస్తున్న ఉద్యోగుల శాతం 80శాతం పైన ఉన్నారని వాళ్లకు సత్వరా న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్సిని ప్రకటించి అమలు చేయడం వల్ల ప్రభుత్వానికి ఆర్థికపరమైన భారం ఏర్పడుతుందని తెలిసినప్పటికీ రాష్ట్రంలో అభివృద్ధి పనుల మీద కొనసాగిస్తున్న కాంట్రాక్టుల విధానం సరైన పద్ధతిలో కొనసాగించగలిగినట్లయితే వేలాది కోట్ల రూపాయలను పోగు చేసుకోవచ్చనే ఆలోచనకు ప్రభుత్వం రావాల్సి ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్సి అనేది వాళ్ళ ఉద్యోగ జన్మత హక్కులాగా భావించబడుతున్న సందర్భంలో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పిఆర్సి అమలు పట్ల కమిటీ వేయడం కమిటీ నివేదిక ఆధారంగా ఆర్థిక వ్యయాన్ని ఆర్థిక వ్యత్యాసాన్ని పరిగణలోనికి తీసుకొని ఎంత శాతం పిఆర్సిని అమలుపరచాల్సి ఉంటుందో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న జనవరిలో పిఆర్సి అమలుపరిచే అవకాశాలు ఉన్నాయని ఇప్పటికే ప్రభుత్వ పెద్దలు ప్రకటించిన సందర్భంలో దానిని తూచా తప్పకుండా ఆచరించి అమలుపరిచి ప్రభుత్వ ఉద్యోగులకు మేలు చేయాలని ఉద్యోగుల తరపున ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కొంతకాలం ఆంధ్ర తెలంగాణ ఉద్యోగులు కలిసి పని చేసినందున ప్రాంతాలు విభాగింపబడి ఉద్యోగులు ఒకేచోట పనిచేయడం వల్ల ఉద్యోగుల ఆధారాలు తెలంగాణ ఉద్యోగుల నిర్దిష్టమైన సంఖ్య స్పష్టత రాకపోవడం వల్ల ప్రత్యేకంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగుల పిఆర్సి ఆలస్యమైందని గుర్తు చేశారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు అవుతుండగా ఇప్పటివరకు పిఆర్సి పై ఉద్యోగులకు ఆశలు కల్పించడం మట్టికే జరుగుతుందని ఆచరణలో మాత్రం ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేరకపోవడం ఉద్యోగులు తీవ్రమైన బాధలో ఉన్నారని గుర్తుచేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కన్నా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యోగుల సేవలను అధికంగా వాడుకుంటున్నారని అలాంటప్పుడు ఉద్యోగులకు రావలసిన న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా అంతే కచ్చితత్వాన్ని ప్రదర్శించాలని కోరారు.ఏ ప్రభుత్వమైనా రాజకీయ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మాత్రమే ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్ఎస్ ని ప్రకటిస్తామంటూ తెలియజేయడం ఉద్యోగులను మోసం చేసిన వాళ్ళుగా భావించాల్సి ఉంటుందన్నారు. గతంలో పేరుకుపోయిన పిఆర్సి బకాయిలను ఎలాగూ విడుదల చేయలేరని తెలిసినప్పటికిని ప్రస్తుతం ఇవ్వబోయే పిఆర్సిలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సరైన న్యాయం జరిగే విధంగా శ్రద్ధ చూపాలని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో అతి కష్టమైన జీవితాలను కొనసాగిస్తున్న పార్ట్ టైం కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఔట్సోర్సింగ్,కార్మికులలాంటి ఉద్యోగులకు చట్టపరమైన న్యాయం జరగాలని ప్రభుత్వ వ్యవస్థల బారమంతా మోస్తున్నది వాళ్లేనని తెలిసినప్పటికీ జీతాలు పొందుకునే విషయంలో మాత్రం అత్యంత అధమ స్థానాలతో అణచివేయబడుతున్నట్లు గుర్తు చేశారు వాళ్ల జీతాల పెరుగుదల అనేసరికి మొఖం చాటేస్తున్న లక్షలాది జీతాలు తీసుకునే ఉన్నతాధికారులు న్యాయం తప్పి ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ప్రతి ప్రభుత్వ శాఖలో ప్రభుత్వ ఉన్నత అధికారులకు పదోన్నతులు కల్పించే విషయంలో, జీతాలు పెంచే విషయాలలో ప్రభుత్వాల అనుమతితో సంబంధం లేకుండా జీతభత్యాలను పెంచుకుంటూ పోతున్న ఉన్నతాధికారులు సామాన్య ఉద్యోగులను అతి సామాన్య ఒప్పంద ఉద్యోగులను మాత్రం కడుపేద స్థితిలోనికి నెట్టివేస్తున్నారని మండిపడ్డారు. అందులో భాగంగానే వాళ్ల సమస్యలు పరిష్కరించాల్సిన నేపథ్యంలో చిన్న సమస్యలను పెద్ద సమస్యలుగా చిత్రీకరించి ప్రభుత్వంపై నెట్టివేస్తూ తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని హెచ్చరించారు.

విశ్రాంత ఉద్యోగులను వేధించొద్దు..

గత ప్రభుత్వం రాష్ట్ర పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యోగ వయోపరిమితిని 61 సంవత్సరాలకు పెంచడం వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో ఆర్థికపరమైనటువంటి లోటు ఏర్పడ్డాయని వాటి వల్ల మూడు సంవత్సరాల కాలం పాటు పదవి విరమణకు దగ్గరగా ఉన్న ఉద్యోగులు 58 నుండి 61కి మరో మూడు సంవత్సరాల కాలపరిమితిని సద్వినియోగం చేసుకుంటూ ఉద్యోగాలు పొందుకోవాల్సిన అవసరం ఏర్పడిందని పదవి విరమణ పొందుతున్న ఉద్యోగులకు పెద్ద ఎత్తున జీతాలు అందుకుంటున్నారని అదే సందర్భంలో పదవి విరమణ పొందిన ఉద్యోగులకు వాళ్లకు రావాల్సిన ఉద్యోగ బెనిఫిట్స్ తో పాటు వాళ్లకు రావాల్సిన పెన్షన్ బకాయిలను పెద్ద మొత్తంలో ఆపడం వల్ల పదవిలో కొనసాగుతున్న ఉద్యోగులతో పాటు పదవి విరమణ పొందిన ఉద్యోగులు ఆర్థికపరమైన మానసిక వేదనను అనుభవిస్తున్నారని గుర్తు చేశారు. సెంట్రల్ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న పిఆర్సి బకాయిలు వర్తించనప్పటికిని కొన్ని ప్రభుత్వ శాఖలలో రాజకీయ పైరవిలతో ప్రత్యేకమైన జీఓలను ఏర్పాటు చేసుకొని పిఆర్సి లను అనుభవిస్తున్నారని ప్రజలు చేస్తున్న అనుమానాలను వ్యక్తపరిచారు.ఏ ప్రభుత్వమైనా పిఆర్సీలను అమలుపరిచే క్రమంలో వేలాదిమంది, లక్షలాది మంది చిన్న ఉద్యోగులు పొందుకుంటున్న పిఆర్సి ఆర్థిక వ్యయాన్ని, పిఆర్సి ఆర్థిక లాభాలను అంచనా వేసే దానికన్నా తక్కువ సంఖ్యలో ఉన్న ఉన్నతాధికారులకు చెల్లించే పిఆర్సి లాభాలను అంచనా వేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారని అన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా విశ్రాంత ఉద్యోగులు వాళ్లకు రావాల్సిన ఉద్యోగ బెనిఫిట్స్ కోసం రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారని వాటిని పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం వాళ్లకు న్యాయం చేస్తామని పలు సందర్భాల్లో హామీ ఇస్తున్నప్పటికీ విశ్రాంత ఉద్యోగుల కష్టాలు కష్టాలుగానే మిగిలిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఆర్థికపరమైన సమస్యలు పెద్ద ఎత్తున తలెత్తునందున ఉద్యోగుల సమస్యలతో పాటు విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి వచ్చేనా అంటూ ఉద్యోగులలో ఆందోళన మొదలైందన్నారు. ఆర్థికపరమైన అప్పులను అధిగమించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధితో పెట్టుబడుల సేకరణను చేపట్టి ఉద్యోగులకు రావాల్సిన న్యాయపరమైన లాభాలను వారికి అందేలా చేయాలని కోరారు.

ఉద్యోగులను రాజకీయాలకు వాడుకోవద్దు..

ప్రభుత్వ ఉద్యోగులు అనగానే రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే సేవలందిస్తూ ప్రజలను ప్రతిపక్షాలను చిన్న చూపు చూసే అలవాట్లు, ఆవశ్యకతలు ప్రతి రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయని అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో మరింతగా పెరుగుతున్నందున ఉద్యోగులను రాజకీయ పరమైన వ్యక్తిగత సేవలకు దూరంగా ఉంచాలని కోరారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రతి ప్రభుత్వ కార్యక్రమాలను నేరుగా నిర్వహిస్తున్న ఉద్యోగులు చాలా సందర్భాల్లో ప్రభుత్వాలకు అనుకూలంగా పనిచేస్తూ తమ చిత్తశుద్ధిని కోల్పోతున్నారని అన్నారు. కారణాలు లేకుండా రాజకీయ నాయకులకు సహకారంగా నిలిచే ఆలోచనలను ప్రభుత్వ ఉద్యోగులు మానుకోవాలని ప్రభుత్వ కార్యాలయాలలో రాజకీయ జోక్యం పూర్తిస్థాయిలో నిర్మూలించ పడగలిగినప్పుడే ప్రభుత్వ వ్యవస్థలు పటిష్టపరచబడుతూ పేద ప్రజలకు సేవలు అందించగలరని అందులో భాగంగానే ప్రభుత్వం ప్రజలకు ఏ విధమైనటువంటి సేవలు అందించగలగాలని ఆలోచన చేస్తుందో వాటిని ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పూర్తిస్థాయిలో అమలుపరచుటకు, నెరవేర్చుటకు అద్భుతమైన సదవకాశాలు లభించగలవని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ శాఖలలో నైతేనేమి ఇతరత్రా వ్యాపారాలలోనైతేనేమి రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోయి ప్రజలకు తీవ్రమైన అన్యాయాలు జరుగుతున్నాయని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకవైపు జాతీయ రాజకీయాలతో మరోవైపు తెలంగాణ రాజకీయాలతో తీరిక సమయం లేకుండా గడుపుతున్నందున ప్రతి సమస్యను నిర్దిష్టమైన కోణంలో పరిష్కారం చేయడానికి అనుకూలమైన సమయం లభించలేకపోతుందని విశ్లేషించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు మంత్రులు రాజకీయ నాయకులు ప్రభుత్వ ఉద్యోగులకు అండగా నిలుస్తూ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఏ నియోజకవర్గంలో చూసిన ప్రజా సమస్యలు పట్టరానివిగా మిగిలిపోతూ ప్రజల కష్టాలకు ఆసరా లేకుండా పోతుందని మొత్తం మీదుగా రొటీన్ పాలనతో గడపాల్సిన పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో కొనసాగడం మరింత బాధాకరం అన్నారు. కేవలం ఉద్యోగులను మాత్రమే కాకుండా అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవాలని తెలియజేశారు.

ఆకతాయిల వేధింపులకు మరో ఆణిముత్యం బలి..

బీసీసీఐ అండర్-19 జట్టుకు ఎంపికైన క్రికెటర్ నందిని మృతి



హైద్రాబాద్, నవంబర్ 13(జై భీమ్ న్యూస్)

వికారాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. క్రికెట్ రంగంలో ప్రతిభ కనబరుస్తూ ఇటీవలే బీసీసీఐ అండర్-19 జట్టుకు ఎంపికైనట్లు సమాచారం ఉన్న 17 ఏళ్ల యువ క్రికెటర్ నందిని అనూహ్యంగా ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. యాలాల్ మండలం సంగయ్యపల్లికి చెందిన నందిని వికారాబాద్ పట్టణంలోని తన అమ్మమ్మ ఇంట్లో ఉంటూ చదువుకుంటోంది. చిన్ననాటి నుంచే క్రికెట్‌పై ఆసక్తి పెంచుకున్న ఆమె ప్రత్యేక శిక్షణ తీసుకుంటూ ఆటలో మంచి ప్రతిభ కనబరిచింది. క్రికెట్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న తరుణంలో ఆమె మృతి చెందడం కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. కాగా, అనిల్, కృష్ణ అనే ఇద్దరు యువకులు కొంతకాలంగా నందినిని వేధిస్తున్నారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అనిల్ ప్రేమ పేరుతో వేధించగా, కృష్ణ అతనికి మద్దతుగా వేధింపులకు పాల్పడినట్లు బంధువులు పేర్కొంటున్నారు. ఈ వేధింపులే నందిని మృతికి కారణమని ఆరోపిస్తూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. నందిని మృతికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ వికారాబాద్ పట్టణంలో కుటుంబ సభ్యులు, బంధువులు రాస్తారోకో నిర్వహించారు. దీంతో రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించడంతో పాటు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎంతో భవిష్యత్తు ఉన్న యువ క్రికెటర్ అకాల మరణం క్రీడాభిమానులను సైతం కలచివేసింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, వేధింపుల ఆరోపణల్లో వాస్తవాలను నిగ్గుతేల్చి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు.

తెలుగు ప్రజలతో 'ఇందిరమ్మ' అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సోనియా గాంధీ

కొత్తగా విడుదలైన తన జ్ఞాపకాల పుస్తకంలో
కీలక విషయాలు వెల్లడించిన సోనియా
తెలుగు ప్రజలు తనను రాజీవ్ గాంధీ భార్యగా కాక,
ఇందిరమ్మ కోడలిగానే చూశారని వెల్లడి
2004లో ఉమ్మడి ఏపీలో జరిపిన యాత్ర నాటి
అనుభవాలను పంచుకున్న సోనియా
లంబాడీ మహిళలు తనను ఇందిరమ్మ కోడలిగా ఆదరించిన
సంఘటనను గుర్తుచేసుకున్న వైనం
నీలం సంజీవరెడ్డి, వీవీ గిరి ప్రస్తావనతో పాటు పలు రాజకీయ ఘట్టాల వెల్లడి



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ, తెలుగు ప్రజలతో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని తన తాజా ఆత్మకథలో గుర్తుచేసుకున్నారు. తనకంటూ ఒక గుర్తింపు రాకముందు, రాజీవ్ గాంధీ భార్యగా కంటే కూడా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ కోడలిగానే తెలుగు ప్రజలు తనను ఎంతగానో ఆదరించారని ఆమె వివరించారు. ఇటీవల ప్రచురితమైన "బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్" అనే తన జ్ఞాపకాల పుస్తకంలో ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. 2004లో జన సంపర్క్ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించినప్పటి అనుభవాలను ఆమె పంచుకున్నారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌ను సందర్శించిన అనంతరం విజయవాడకు ప్రయాణిస్తుండగా, మార్గమధ్యంలో 'ఇందిరమ్మ'కు మద్దతుగా నినాదాలు వినిపించాయని తెలిపారు. ఈ ప్రయాణంలో రోడ్డు పక్కన నిల్చున్న లంబాడీ (బంజారా) మహిళల బృందం తన దృష్టిని ఆకర్షించిందని సోనియా పేర్కొన్నారు. వారి సాంప్రదాయ ఎరుపు, నీలం రంగుల లెహంగాలు, అద్దాలతో కుట్టిన ఓణీలు చూసి, తన మెహందీ వేడుక నాటి దుస్తులను గుర్తుచేసుకుని వాహనం ఆపానని చెప్పారు. ఆ మహిళలు ఆప్యాయంగా తన తలపై ఓణీ కప్పి, తమ సంప్రదాయ దుస్తులకు ఉన్న ప్రాముఖ్యతను తెలుసుకుని ఆనందంతో నాట్యం చేశారని, తనను కూడా అందులోకి లాగారని సోనియా రాశారు. 'నువ్వు ఇందిరమ్మ కోడలివి, అందుకే నీకు, కాంగ్రెస్‌కు ఓటేస్తాం' అని ఆ మహిళలు తనతో చెప్పిన మాటలు ఎప్పటికీ గుర్తుంటాయని సోనియా తెలిపారు. ఈ సంఘటన ప్రజల నాడిని అర్థం చేసుకోవడానికి, తన రాజకీయ ప్రయత్నాలను కొనసాగించడానికి ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చిందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ పుస్తకంలో తెలుగు నేతలకు సంబంధించిన పలు పాత రాజకీయ సంఘటనలను కూడా సోనియా ప్రస్తావించారు. 1969 రాష్ట్రపతి ఎన్నికల్లో కాంగ్రెస్ సిండికేట్ అభ్యర్థి అయిన నీలం సంజీవరెడ్డికి వ్యతిరేకంగా ఇందిరా గాంధీ.. వీవీ గిరికి మద్దతిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆత్మప్రబోధానుసారం ఓటు వేయాలన్న పిలుపుతో గిరి విజయం సాధించిన తీరును వివరించారు. అలాగే, 1975లో అలహాబాద్ హైకోర్టు తీర్పు తర్వాత నెలకొన్న రాజకీయ సంక్షోభం సమయంలో జరిగిన పరిణామాలను కూడా ఆమె ఈ పుస్తకంలో పొందుపరిచారు.

చెక్కులు ఇచ్చారు.. నగదు మరిచారు!

ముఖ్యమంత్రి స్వయంగా హామీ ఇచ్చినా అందని ప్రభుత్వ ఉద్యోగాలు..
ప్రోత్సాహక నగదు కోసం ఎదురుచూస్తున్న క్రీడాకారులు

హైద్రాబాద్, నవంబర్ 13(జై భీమ్ న్యూస్)

అంతర్జాతీయ స్థాయిలో దేశానికి, రాష్ట్రానికి గుర్తింపు తీసుకొచ్చిన క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందించడంలో జాప్యం జరుగుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆసియా క్రీడలు, ప్రపంచ ఛాంపియన్‌షిప్, ఆసియా ఛాంపియన్‌షిప్‌లలో పతకాలు సాధించి రాష్ట్ర ప్రతిష్ఠను పెంచిన క్రీడాకారులకు కనీస గౌరవం కూడా దక్కడం లేదంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించిన నగదు ప్రోత్సాహకాలు, ప్రభుత్వ ఉద్యోగాల హామీలు సైతం అమలుకు నోచుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. గత ఏడాది ప్రపంచ స్థాయిలో పతకాలు సాధించిన పలువురు క్రీడాకారులకు గచ్చిబౌలి స్టేడియంలో భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నగదు ప్రోత్సాహకాలకు సంబంధించిన చెక్కులను అందజేశారు. బధిర షూటర్ ధనుష్ శ్రీకాంత్‌కు రూ. 2.10 కోట్లు, పారా అథ్లెట్ జీవాంజి దీప్తికి రూ. 50 లక్షలు, షూటర్ తనిష్‌కు రూ. 53.65 లక్షలు, బాక్సర్ నిఖత్ జరీన్‌కు రూ. 60 లక్షలు, షూటర్ ఇషా సింగ్‌కు రూ. 3.25 కోట్ల ప్రోత్సాహకాలకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. అయితే వీరితో పాటు అద్భుత ప్రతిభ కనబరిచిన అథ్లెట్ అగసర నందినికి రూ. 25 లక్షలు, ఆర్చర్ చికితకు రూ. 75 లక్షల నగదు ప్రోత్సాహకాలు ఇప్పటికీ అందలేదని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెక్కులు అందించినప్పటికీ నగదు విడుదల విషయంలో జాప్యం జరగడం, కొందరికి ప్రకటించిన ప్రోత్సాహకాలు అందకపోవడం ప్రభుత్వ హామీల అమలుపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. మరోవైపు షూటర్ ఇషా సింగ్‌కు గ్రూప్-1 ఉద్యోగం, పారా అథ్లెట్ జీవాంజి దీప్తికి గ్రూప్-2 ఉద్యోగం కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఉద్యోగాలు దక్కలేదని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన తమకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో), ఆర్థికశాఖ, క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) మధ్య సరైన సమన్వయం లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని క్రీడాకారులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ పెద్దలు హామీలు ఇచ్చినా క్షేత్రస్థాయిలో వాటిని అమలు చేయాల్సిన అధికారులు చొరవ చూపకపోవడంతో తమకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తామని ప్రకటించడం మాత్రమే కాకుండా, ఇచ్చిన హామీలను నిర్ణీత సమయంలో అమలు చేయాలని వారు కోరుతున్నారు. పెండింగ్‌లో ఉన్న నగదు ప్రోత్సాహకాలను వెంటనే విడుదల చేయడంతో పాటు ప్రకటించిన ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారుల విషయంలో ప్రభుత్వం, అధికారులు ఇకనైనా స్పందిస్తారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.



జై భీమ్ తెలుగు దినపత్రిక
సమస్యలపై సమరంగా
POWER OF PEOPLE
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి





బాలికల హక్కులు, విద్య, భద్రతపై విద్యార్థినులకు అవగాహన
శ్రీనగర్ బాలికోన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం

కాకినాడ, నవంబర్ 13(జై భీమ్ న్యూస్)

బాల్య వివాహాల నిర్మూలనతోనే బాలికలకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సి.హెచ్. వెంకట్రావు పిలుపునిచ్చారు. బాల్య వివాహ ముక్త్ భారత్ 100 రోజుల ప్రచార కార్యక్రమంలో భాగంగా స్థానిక శ్రీనగర్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు బాల్య వివాహాల నిర్మూలన, బాలల హక్కులు, రక్షణ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి సి.హెచ్. వెంకట్రావు ఆధ్వర్యంలో, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. సత్యవతి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికల భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు. చిన్న వయస్సులో వివాహాలు జరగడం వల్ల విద్యాభ్యాసానికి ఆటంకం కలగడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, సామాజికంగా కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. బాల్య వివాహ నిషేధ చట్టం ప్రకారం 18 సంవత్సరాలు నిండని బాలికలకు, 21 సంవత్సరాలు నిండని బాలురకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. అలాగే బాలల హక్కులు, వారి రక్షణకు సంబంధించిన చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాలలపై జరిగే హింస, వేధింపులు, బాలకార్మికత్వం, అక్రమ రవాణా వంటి సమస్యలను వివరించి, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి బాలిక తన హక్కులపై అవగాహన కలిగి ఉండటంతో పాటు ఉన్నత విద్యను అభ్యసించి, ఆత్మవిశ్వాసంతో స్వతంత్రంగా జీవితంలో ఎదగాలని ఆకాంక్షించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసినప్పుడు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. బాలల రక్షణ కోసం 24 గంటల పాటు అందుబాటులో ఉండే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. బాల్య వివాహాల నిర్మూలన కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములైనప్పుడే బాల్య వివాహ రహిత సమాజాన్ని నిర్మించగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంరక్షణ అధికారి జె. విజయ, కౌన్సిలర్ దుర్గారాణి, డీసీపీయూ సోషల్ వర్కర్ చిన్నబాబు, శిశు గృహ సోషల్ వర్కర్ ఓ. లక్ష్మీ రేవతి, జీఎంఎస్‌కేలు పరిమళ, ప్రమీల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంపై ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేయాలి

క్యూఆర్ కోడ్, వాట్సాప్ ద్వారా అభిప్రాయాల నమోదు చేసుకునే అవకాశం
ఫిర్యాదుల నమోదు కోసం 1100 టోల్ ఫ్రీ నంబర్ వినియోగించుకోవాలి
జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి




రాజమహేంద్రవరం, నవంబర్ 13(జై భీమ్ న్యూస్)

ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను పరిష్కరించిన అనంతరం, ఆ పరిష్కారంపై పౌరుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఇందులో భాగంగా క్యూఆర్ కోడ్, వాట్సాప్ ఆధారిత అభిప్రాయ సేకరణ విధానాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఫిర్యాదుల పరిష్కారంపై ప్రజలు తమ నిజమైన అభిప్రాయాలను స్వచ్ఛందంగా తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఫిర్యాదు పరిష్కారమైన వెంటనే సంబంధిత క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని నమోదు చేయవచ్చని, అదేవిధంగా 95523 00009 వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ ద్వారా కూడా అభిప్రాయాలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు. ఈ విధానాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అన్ని స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో క్యూఆర్ కోడ్‌లను ప్రముఖంగా ప్రదర్శించాలని, పోస్టర్లు, బ్యానర్లు, నోటీసుల ద్వారా వాట్సాప్ అభిప్రాయ సేకరణ విధానంపై ప్రచారం నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ (పీజీఆర్ఎస్) కౌంటర్ అందుబాటులో లేని సమయాల్లో ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను నమోదు చేసుకునేందుకు 1100 టోల్ ఫ్రీ నంబర్ను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే 95523 00009 వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ ద్వారా, సమీపంలోని స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా కూడా ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారంపై అభిప్రాయాలు తెలియజేయడం పూర్తిగా పౌరుల స్వచ్ఛంద నిర్ణయమని, ఎలాంటి ఒత్తిడి, ప్రభావం లేకుండా ప్రజలు తమ వాస్తవ అభిప్రాయాలను తెలియజేసేలా అధికారులు సహకరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సౌకర్యాలను ప్రజలు విస్తృతంగా వినియోగించుకునేలా సంబంధిత అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

టీడీపీ తమ్ముళ్లలో బయటపడుతున్న అసంతృప్తి

కాకినాడ, నవంబర్ 13(జై భీమ్ న్యూస్) :



ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ నాయకత్వంపై క్యాడర్ అంత సంతృప్తికరంగా లేరు. ఇటీవల జరిగిన జరిగిన పట్టణ స్థానిక సంస్థలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా ఎన్డీఏ కూటమి భారీ విజయం సాధించినప్పటికీ, సీట్ల సర్దుబాటు మరియు స్థానిక నాయకత్వ నిర్ణయాలపై తెలుగుదేశం పార్టీ క్యాడర్‌లో పలుచోట్ల అసంతృప్తి వ్యక్తమైంది. కూటమి ధర్మం పేరుతో మిత్రపక్షాలకు సీట్లు కేటాయించడంపై క్షేత్రస్థాయి శ్రేణులు, ఆశావహులు తమ అసహనాన్ని వెళ్లగక్కారు. పార్టీ నుంచి కష్టపడిన తమకు ఎలాంటి పదవులు ఇవ్వకుండా, టీడీపీ కార్యకర్త జెండా వదలకుండా పనిచేస్తాడని చంద్రబాబు కితాబు ఇవ్వడాన్ని కొందరు సోషల్ మీడియా వేదికగా తప్పుపడుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, లేనప్పుడు మరొకలా వ్యవహరించడం ఈ నాయకత్వానికి పరిపాటిగా మారిందని, సీటు దక్కకపోతే రెబల్స్ గా పోటీ చేస్తే తిరిగి పార్టీలోకి చేర్చుకోలేదని చంద్రబాబు చెప్పడంపై కూడా కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.ఎన్నికల సమాచారం చూడండికూటమి సీట్ల పంపకాలపై అసంతృప్తిగా క్యాడర్ లో నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థల్లో టీడీపీ 89, జనసేన 25, బీజేపీ 9 స్థానాల్లో పోటీ చేసేలా సీట్ల పంపకాలు జరిగాయి. అయితే, రెండు దశాబ్దాలుగా కోర్టు కేసులతో పోరాడి ఎన్నికలకు సిద్ధం చేసిన రాజాం మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానాన్ని జనసేనకు కేటాయించడంపై స్థానిక టీడీపీ నేతలు ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్‌కు వినతిపత్రం ఇచ్చి తమ అసంతృప్తిని అధిష్టానానికి తెలియజేశారు. తమ అభిప్రాయాలను తీసుకోకుండా, స్థానిక సంస్థల నాయకత్వం మనసులో ఉన్నది తెలుసుకోకుండా, కనీసం ఎమ్మెల్యేలను కూడా భాగస్వామ్యులుగా చేయకుండా నిర్ణయం తీసుకోవడం ఏంటని కొందరు సూటిగా ప్రశ్నిస్తున్నారు. అధికారంలోకి వచ్చినప్పుడల్లా తమను పదవులకు దూరం చేయడం, అధికారం కోల్పోయిన తర్వాత మీ తర్వాతే ఎవరైనా అని ప్రకటనలు చేయడం షరా మామూలుగా మారిందని సోషల్ మీడియాలో క్యాడర్ చేస్తున్న కామెంట్స్ వైరల్ గా మారాయి.రెబల్స్‌పై అధిష్టానం వేటు వేయడాన్ని కూడా తప్పుపడుతున్నారు. టికెట్లు దక్కని ఆశావహులు పార్టీ ఆదేశాలను ధిక్కరించి స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగితే తప్పేంటని ప్రశ్నిస్తున్నారు. పలు జిల్లాలకు చెందిన 11 మందికి పైగా నేతలను టీడీపీ సస్పెండ్ చేసిందని, విజయనగరం, కృష్ణా, ఆలూరు, జెడి నెల్లూరు తదితర నియోజకవర్గాల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనే కారణంతో ఈ చర్యలు తీసుకుంటే కార్యకర్తలకు ఏం సందేశం ఇవ్వగలరని వారు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గాల్లో వర్గ విభేదాలు. స్థానిక సంస్థల ఎన్నికల టికెట్ల కేటాయింపు మరియు సమన్వయకర్తల నియామకం విషయంలో అన్నమయ్య జిల్లా రాజంపేట వంటి నియోజకవర్గాల్లో టీడీపీ నాయకుల మధ్య అంతర్గత విభేదాలు, వర్గ పోరు బహిర్గతమైన విషయాన్ని గుర్తించలేదని, కార్యకర్తలకు మాత్రం అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఎన్నికల సమాచారం చూడండిరాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ మిత్రపక్షాలకు సీట్లు ఇలాగే పంచుకుంటూ పోతే సాధారణ ఎన్నికలకు మనసుపెట్టి పనిచేసెదవరని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్నలకు చంద్రబాబు మాత్రమే సమాధానమివ్వాలని కోరుతున్నారు.

యువతతోనే కాంగ్రెస్ పార్టీకి బంగారు భవిష్యత్తు

యువతకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తాం
పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి




ఆత్మకూర్, నవంబర్ 13(జై భీమ్ న్యూస్)

యువతే కాంగ్రెస్ పార్టీకి బంగారు భవిష్యత్తు అని గుర్తించిన ప్రజా ప్రభుత్వం యువతకు రాజకీయ, సామాజిక, ఇతర అన్ని రంగాల్లో సముచిత అవకాశాలు కల్పిస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు యువతకు ప్రాధాన్యత కల్పిస్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. శుక్రవారం హనుమకొండలోని తన నివాసంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.ఆర్. దిలీప్ రాజ్ ఆధ్వర్యంలో, పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ సమక్షంలో ఆత్మకూర్ మండలంలోని 15 గ్రామాలకు నూతన యూత్ కాంగ్రెస్ అధ్యక్షులను ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సేవలో చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో యువత ముందుండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, యువతకు తనతో పాటు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ వారికి అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.ఆర్. దిలీప్ రాజ్, పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్, మండల అధ్యక్షుడు తనుగుల సందీప్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే నాయకత్వంలో గ్రామగ్రామాన యూత్ కాంగ్రెస్ నూతన కమిటీలను ఏర్పాటు చేస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తామని మాదాసి శ్రీధర్ అన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో యువతకు జరిగిన అన్యాయాలు, గ్రామాల్లో చోటుచేసుకున్న దోపిడీ, అవినీతి, అక్రమాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత యువతపై ఉందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో పరకాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలే కాంగ్రెస్ పార్టీ విజయానికి సోపానాలుగా నిలుస్తాయని అన్నారు. ఆత్మకూర్ మండలంలోని 15 గ్రామాలకు ప్రకటించిన నూతన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుల్లో కటాక్షపూర్‌కు ఎం.డి. అజారుద్దీన్, హాస్ బూజుర్గ్‌కు ఎస్.డి. ఇష్తాకార్, సిరుకుల్లకు ఆర్యం సాగర్, పెంచికలపేటకు సుద్దాల అనిల్, కామారానికి రాధారపు భరత్, తిరుమలగిరికి కేరళ తిరుపతి, ఆత్మకూర్‌కు ఎల్లబోయిన శ్రీశైలం, గూడెపాడ్‌కు బలభద్ర రాజేష్, మల్కపేటకు బుస్స సాయి కిరణ్, చెల్లపల్లికి గుర్రం చరణ్, అగ్రంపాడ్‌కు కొత్తపల్లి నాగరాజు, పెద్దాపూర్‌కు ముక్కాల కార్తీక్, లింగమడుగుపల్లికి వజిరే విజయ్ కుమార్, అక్కంపేటకు నాగనబోయిన వినయ్, నాగయ్యపల్లికి మాదాసి ప్రవీణ్‌లను నియమించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రేవూరి జలంధర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తనుగుల సందీప్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల ఆస్తులు, రికార్డులను కాకినాడ కార్పొరేషన్‌కు బదిలీ చేయాలి

తక్షణమే ప్రభుత్వ జీవో, గెజిట్ విడుదల చేయాలి
ముఖ్యమంత్రికి పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు వినతి

కాకినాడ, నవంబర్ 13(జై భీమ్ న్యూస్)



కాకినాడ నగర విస్తరణలో భాగంగా గతంలో నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాల ఆస్తులు, రికార్డులు, అప్పులు, ఉద్యోగులను కాకినాడ నగరపాలక సంస్థకు అధికారికంగా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక జీవోతో పాటు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్, ప్రముఖ సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రికి వినతిపత్రం పంపినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా రమణరాజు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013లో కాకినాడ నగర విస్తరణలో భాగంగా వాకలపూడి, వలసపాకల, రమణయ్యపేట, ఇంద్రపాలెం, తూరంగి, చీడిగ, స్వామినగర్, ఎస్. అచ్యుతాపురం గ్రామాలను కాకినాడ నగరపాలక సంస్థలో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తుచేశారు. అయితే ఆయా గ్రామాల్లో స్వామినగర్, ఎస్. అచ్యుతాపురం (మధురానగర్) గ్రామాలకు సంబంధించిన రికార్డులను మాత్రమే అప్పటి జిల్లా కలెక్టర్ కార్పొరేషన్‌కు అప్పగించారని, మిగిలిన ఆరు గ్రామాలకు సంబంధించిన పంచాయతీ రికార్డులు, ఆస్తుల బదిలీ ప్రక్రియ ఇప్పటికీ పూర్తికాలేదని పేర్కొన్నారు. విలీన ప్రక్రియ పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం వల్ల ఆయా ప్రాంతాల ప్రజలు అనేక మౌలిక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వాకలపూడి రామకృష్ణ నగర్ వంటి ప్రాంతాల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు, వరద నీరు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంచాయతీలకు సంబంధించిన ఆస్తులు, రికార్డులు అధికారికంగా కార్పొరేషన్‌కు బదిలీ అయినప్పుడే ఆయా ప్రాంతాలకు శాశ్వత అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి, అవసరమైన నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ప్రస్తుతం ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం 2011 జనాభా ప్రాతిపదికన, 2026 ఓటరు జాబితాను పరిగణనలోకి తీసుకుని హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ కొనసాగిందని తెలిపారు. విలీనానికి వ్యతిరేకంగా దాఖలైన వ్యాజ్యాలు హైకోర్టులో డిస్మిస్ అయినప్పటికీ, ఎనిమిది గ్రామాలను పూర్తిస్థాయిలో కాకినాడ నగరపాలక సంస్థలో కలిపే చట్టపరమైన ప్రక్రియకు తగిన వ్యవధి లేకపోవడంతో నగర విస్తరణ పూర్తి కాకుండానే కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గవర్నర్ ఆర్డినెన్స్ ప్రకారం ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసి, విలీన గ్రామాలకు సంబంధించిన పంచాయతీ ఆస్తులు, అప్పులు, రికార్డులు, ఉద్యోగులను కాకినాడ నగరపాలక సంస్థకు బదిలీ చేసేలా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. ఎన్నికల ప్రక్రియతో పాటు విలీన గ్రామాల పరిపాలన, అభివృద్ధికి సంబంధించిన అంశాలను కూడా ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచించారు. విలీన గ్రామాల ప్రజలకు నగరపాలక సంస్థ ద్వారా అందాల్సిన మౌలిక సదుపాయాలు, అభివృద్ధి ఫలాలు పూర్తిస్థాయిలో అందాలంటే ఆస్తులు, రికార్డుల బదిలీ ప్రక్రియలో ఇకపై జాప్యం జరగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని దూసర్లపూడి రమణరాజు విజ్ఞప్తి చేశారు.

మల్లన్న హత్యకు మానవ మృగాల కుట్ర

తెలంగాణ డీజీపీకి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఫిర్యాదు
బీసీ రాజ్యాధికార పాదయాత్రలో అనుమానాస్పద రోడ్డు ప్రమాదం
సమగ్ర దర్యాప్తు కోరుతూ డీజీపీని కలిసి ఫిర్యాదు చేసిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



హైదరాబాద్ జై భీమ్ డెస్క్

బీసీల రాజకీయ, సామాజిక, రాజ్యాంగబద్ధమైన8 హక్కులపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, వారి హక్కుల సాధన కోసం ప్రజలను చైతన్యపరిచే లక్ష్యంతో చేపట్టిన బీసీ రాజ్యాధికార పాదయాత్రలో పాల్గొంటున్న సమయంలో ఒక అత్యంత తీవ్రమైన, ఆందోళనకరమైన సంఘటన చోటుచేసుకుందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తెలిపారు. వలిగొండ నుంచి తొర్రూరు హైవే వైపు కొనసాగుతున్న బీసీ రాజ్యాధికార పాదయాత్ర సందర్భంగా జరిగిన ఈ ఘటనను తెలంగాణ డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు.

లారీతో వాహనాలను ఢీకొట్టిన ఘటన.

యాదాద్రి భువనగిరి జిల్లా, మోత్కూర్ మండలంలోని అన్నాజీపురం--తిరుమలగిరి రోడ్డు సమీపంలో పాదయాత్ర కొనసాగుతున్న సమయంలో.టీజి30టి7596 రిజిస్ట్రేషన్ నంబర్ కలిగిన లారీ అకస్మాత్తుగా, అత్యంత వేగంగా వచ్చి తన వాహనమైన టిజి30ఎల్ 4444 రిజిస్ట్రేషన్ నంబర్ గల టయోటా ఫార్చునర్ కారును, అలాగే టిజి30టి7596 నంబర్ గల తెలుపు రంగు టాటా ఆల్ట్రోజ్ కారును బలంగా ఢీకొట్టిందని తెలిపారు. ఈ ప్రమాదం కారణంగా తన సిబ్బందితో పాటు మరో వాహనంలో ప్రయాణిస్తున్న వ్యక్తులకు కూడా తీవ్ర గాయాలయ్యాయని పేర్కొన్నారు.

నా హత్యకు కుట్ర జరిగి ఉండవచ్చనే అనుమానం.

ఈ ప్రమాదం జరిగిన పరిస్థితులు అత్యంత అనుమానాస్పదంగా ఉన్నాయని తీన్మార్ మల్లన్న లేఖలో పేర్కొన్నారు.ఈ ఘటన తన వ్యక్తిగత భద్రతతో పాటు, బీసీ రాజ్యాధికార పాదయాత్రలో తనతో కలిసి పాల్గొంటున్న వ్యక్తుల భద్రతపై తీవ్రమైన ఆందోళనలను కలిగిస్తోందని తెలిపారు. తన రాజకీయ కార్యకలాపాలను వ్యతిరేకిస్తున్న కొందరు వ్యక్తులు, వెనుకబడిన తరగతుల రాజకీయ సాధికారత కోసం తాను చేస్తున్న పోరాటాన్ని అడ్డుకోవాలనే ఉద్దేశంతో ఈ ప్రమాదాన్ని ఉద్దేశపూర్వకంగా సృష్టించి ఉండవచ్చని బలంగా అనుమానిస్తున్నట్లు తెలిపారు. తనకు శారీరక హాని కలిగించడం లేదా తనను హత్య చేయడం లక్ష్యంగా ఈ ఘటనను పథకం ప్రకారం నిర్వహించి ఉండవచ్చనే అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ లారీని ఉపయోగించి ముందస్తు ప్రణాళికతో తనపై దాడి చేసి ఉండే అవకాశాన్ని కొట్టిపారేయలేమని గట్టిగా విశ్వసిస్తున్నట్లు తెలిపారు. వృత్తిపరమైన ప్రమాణాలతో, ఆధారాల ఆధారంగా, నిష్పక్షపాతంగా పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని కోరారు.

తక్షణమే క్రిమినల్ కేసు నమోదు చేయాలి.

ఈ ఘటన తీవ్రతను, తన ప్రాణాలకు పొంచి ఉన్న ముప్పును దృష్టిలో ఉంచుకుని తక్షణమే తగిన సెక్షన్ల కింద క్రిమినల్ కేసు నమోదు చేయాలని డీజీపీని కోరారు. ఈ ప్రమాదం వెనుక ఉద్దేశపూర్వకంగా, ముందస్తు ప్రణాళికతో వాహనాన్ని ఉపయోగించి దాడి చేసే కుట్ర ఏమైనా ఉందా అనే కోణంలో కూడా సమగ్ర దర్యాప్తు జరపాలని విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) స్థాయికి తగ్గకుండా ఒక సీనియర్ పోలీసు అధికారిని దర్యాప్తు బాధ్యతలకు నియమించాలని కోరారు.ఈ ఘటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిష్పక్షపాతంగా విచారించాలని విజ్ఞప్తి చేశారు.

లారీ యజమాని, డ్రైవర్ వివరాలపై విచారణ.

ప్రమాదానికి కారణమైన తిగజి30టి7596 రిజిస్ట్రేషన్ నంబర్ గల లారీకి సంబంధించిన పూర్తి వివరాలను సేకరించాలని,ముఖ్యంగా లారీ యాజమాన్యం, రిజిస్ట్రేషన్ వివరాలు, డ్రైవర్ వ్యక్తిగత వివరాలు, అతని ఉద్యోగ సంబంధాలు, గతంలో ఆ వాహనం ఎక్కడెక్కడ ప్రయాణించింది వంటి అంశాలపై విచారణ జరపాలని,తనను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకోవడానికి ఎవరైనా వ్యక్తులు ఆ లారీని లేదా డ్రైవర్‌ను ఉపయోగించారా అనే విషయాన్ని నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు.

సీసీటీవీ, ఎలక్ట్రానిక్ ఆధారాలను సేకరించాలి.

ప్రమాదం జరిగిన ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీ, హైవే నిఘా కెమెరాల రికార్డులు, సమీపంలోని వ్యాపార సంస్థలు లేదా ఇతర భవనాల కెమెరా దృశ్యాలు, మొబైల్ ఫోన్ వీడియోలు,కాల్ రికార్డింగ్స్ ఇతర ఎలక్ట్రానిక్ ఆధారాలను తక్షణమే భద్రపరచాలని కోరారు.ఆ ఆధారాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవాలను వెలికితీయాలని విజ్ఞప్తి చేశారు.

రాజకీయ కుట్ర కోణంలోనూ విచారణ జరపాలి.

ఈ ఘటన వెనుక ఏదైనా కుట్ర ఉందా, నేరపూరిత బెదిరింపులు ఉన్నాయా, ముందస్తుగా తనపై నిఘా పెట్టారా, రాజకీయ శత్రుత్వం కారణమైందా అనే అంశాలను కూడా విచారించాలని కోరారు. అలాగే బీసీ రాజ్యాధికార పాదయాత్రను అడ్డుకోవడానికి లేదా అందులో పాల్గొంటున్న వ్యక్తుల ప్రాణాలకు ముప్పు కలిగించడానికి ఉద్దేశపూర్వకంగా ఈ ఘటనకు పాల్పడ్డారా అనే కోణంలోనూ దర్యాప్తు జరపాలని కోరారు.

బీసీ రాజ్యాధికార పాదయాత్ర ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమం

వెనుకబడిన తరగతులకు న్యాయం, తగిన ప్రాతినిధ్యం, రాజకీయ సాధికారత సాధించాలనే ప్రజాస్వామ్యబద్ధమైన లక్ష్యంతో బీసీ రాజ్యాధికార పాదయాత్రను చేపడుతున్నామని తీన్మార్ మల్లన్న స్పష్టం చేశారు. ఈ ప్రజాస్వామ్య ఉద్యమంలో పాల్గొంటున్న వ్యక్తులను బెదిరించడం, భయభ్రాంతులకు గురిచేయడం లేదా శారీరకంగా హాని కలిగించడానికి ప్రయత్నించడం అత్యంత తీవ్రమైన విషయమని,ఇలాంటి ఘటనలపై చట్టాన్ని అమలు చేసే అధికారులు అత్యంత ప్రాధాన్యంతో స్పందించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

తెలంగాణ పోలీసులపై నాకు పూర్తి విశ్వాసం ఉంది.

ప్రజాప్రతినిధిగా తనకు చట్టంపై, తెలంగాణ పోలీసుల నిష్పక్షపాత పనితీరుపై పూర్తి విశ్వాసం ఉందని తీన్మార్ మల్లన్న తెలిపారు.అందువల్ల ఈ ఘటనపై డీజీపీ వ్యక్తిగతంగా తక్షణమే జోక్యం చేసుకుని, అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు జరిగేలా చూడాలని కోరారు.ఈ ఘటనకు సంబంధించిన ఏ ఒక్క ఆధారమూ నాశనం కాకుండా, ఏ అంశమూ దర్యాప్తు నుంచి తప్పిపోకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ ఘటనకు బాధ్యులైన వ్యక్తులను గుర్తించి చట్టం ముందు నిలబెట్టాలని కోరారు. ప్రజలచే ఎన్నికైన ఒక ప్రజాప్రతినిధి భద్రతకు సంబంధించిన ఈ తీవ్రమైన ఘటనను అత్యవసర అంశంగా పరిగణించి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీ కుమార్ యాదవ్,ప్రధాన కార్యదర్శి అశోక్ ముదిరాజ్,క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నర్సయ్య గౌడ్ పాల్గొన్నారు.

ఏపీలో రూ.36 కోట్ల పెట్టుబడి..

ప్రభుత్వంతో మంచు మనోజ్ దంపతుల ఎంఓయూ
విశాఖ సీఐఐ సదస్సులో ఎంవోయూ చేసుకున్న 'నమస్తే వరల్డ్'
ఏపీలో రూ.36 కోట్ల పెట్టుబడి పెట్టనున్న మంచు మనోజ్ దంపతులు
కర్నూలు జిల్లా ఓర్వకల్లులో ప్లాంట్ ఏర్పాటుకు అవకాశం
భారతీయ సంస్కృతి ఉట్టిపడే బొమ్మలు, హస్తకళల తయారీ
పారిశ్రామికవేత్త హోదాలో ఒప్పందంపై సంతకం చేసిన భూమా మౌనిక



విశాఖపట్నం, నవంబర్ 13(జై భీమ్ న్యూస్) :

విశాఖపట్నం వేదికగా జరుగుతున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026లో సినీ నటుడు మంచు మనోజ్, ఆయన అర్ధాంగి భూమా మౌనిక రెడ్డి స్థాపించిన 'నమస్తే వరల్డ్' స్టార్టప్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రంలో రూ.36 కోట్ల పెట్టుబడితో పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ఈ ఎంవోయూ చేసుకున్నారు. పారిశ్రామికవేత్త హోదాలో, 'నమస్తే వరల్డ్' వ్యవస్థాపకురాలిగా భూమా మౌనిక రెడ్డి ఈ ఒప్పందంపై సంతకం చేశారు. కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో వీరి పరిశ్రమను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఈ స్టార్టప్ ద్వారా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా పిల్లల ఆటబొమ్మలు, హస్తకళా ఉత్పత్తులను తయారు చేసి స్వదేశీ కళాకారులకు ప్రోత్సాహం అందించనున్నారు. ఈ సందర్భంగా భూమా మౌనిక మాట్లాడుతూ.. సీఐఐ సదస్సు ద్వారా ఎంతో మంది హస్తకళాకారులు, యువ పారిశ్రామికవేత్తలు ఒకే వేదికపైకి రావడం సంతోషంగా ఉందన్నారు. స్థానిక కళాకారులు, స్టార్టప్‌ల ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలు కల్పించడంలో ఈ సదస్సు కీలక పాత్ర పోషిస్తోందని అభిప్రాయపడ్డారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఏపీ ప్రభుత్వానికి, నిర్వాహకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా నిలిచిపోయిన మైక్రోసాఫ్ట్ సేవలు..

లక్షలాది మంది యూజర్లకు చుక్కలు!

టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సేవలకు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర అంతరాయం కలిగింది. ముఖ్యంగా ఈమెయిల్ సర్వీస్ అయిన ఔట్‌లుక్‌తో పాటు టీమ్స్ యాప్‌లో సమస్యలు తలెత్తడంతో లక్షలాది మంది యూజర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటల తరబడి ఈమెయిళ్లు పంపడం, స్వీకరించడం సాధ్యపడలేదని, ఇన్‌బాక్స్‌లు లోడ్ కాలేదని అనేకమంది ఫిర్యాదు చేశారు. ఔటేజ్ ట్రాకర్ అయిన డౌన్‌డెటెక్టర్ ప్రకారం, గురువారం ఒక్కసారిగా సుమారు 1.30 లక్షల మంది యూజర్లు ఔట్‌లుక్‌లో సమస్యలు ఉన్నట్లు రిపోర్ట్ చేశారు. కేవలం ఔట్‌లుక్ మాత్రమే కాకుండా, మైక్రోసాఫ్ట్ వర్క్‌ప్లేస్ మెసేజింగ్ యాప్ 'టీమ్స్', ఏఐ అసిస్టెంట్ 'కో-పైలట్', మైక్రోసాఫ్ట్ 365 సూట్‌లోని ఇతర సేవల్లోనూ అంతరాయం ఏర్పడినట్లు వేలాది మంది ఫిర్యాదు చేశారు. ఈ పరిణామంతో ప్రపంచవ్యాప్తంగా ఆఫీసు పనులు, ఇతర కమ్యూనికేషన్లకు తీవ్ర ఆటంకం కలిగింది. ఈ అంతరాయంపై మైక్రోసాఫ్ట్ స్పందించింది. అమెరికాలోని యూజర్లు ఎక్స్ఛేంజ్ ఆన్‌లైన్ మెయిల్‌బాక్స్‌లను యాక్సెస్ చేయడంలో ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. తమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లోని ఒక భాగంపై అసాధారణంగా లోడ్ పెరిగిందని, దీనివల్లే కనెక్టివిటీ సమస్యలు తలెత్తాయని తొలుత భావించింది. అయితే, ఆ తర్వాత అసలు కారణాన్ని గుర్తించింది. ఆటోమేటెడ్ తనిఖీల సమయంలో కొన్ని సర్వర్లు విఫలం కావడం వల్ల అవి అనూహ్యంగా అందుబాటులో లేకుండా పోయాయని, ఇదే సమస్యకు మూలమని నిర్ధారించింది. ఈ వైఫల్యానికి దారితీసిన పూర్తి సాంకేతిక కారణాలను వెల్లడించనప్పటికీ, సమస్యను పరిష్కరించేందుకు ఒక ఫిక్స్‌ను పరీక్షిస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ తెలిపింది. "ప్రభావాన్ని తగ్గించడానికి సాధ్యమైన అన్ని మార్గాల్లో దూకుడుగా ప్రయత్నిస్తున్నాం" అని మైక్రోసాఫ్ట్ 365 స్టేటస్ ఖాతా 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) లో పోస్ట్ చేసింది. కాగా, ఉత్తర అమెరికాలో టీమ్స్‌కు సంబంధించిన సమస్యలను పునరుద్ధరించామని కంపెనీ అంతకుముందు ప్రకటించినా, కొంతమంది యూజర్లకు కనెక్టివిటీ సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయని ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

విజయవాడ, నవంబర్ 13(జై భీమ్ న్యూస్) :


ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి మున్సిపల్ ఎన్నికల సందడి మొదలుకానుంది. పెండింగ్‌లో ఉన్న పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. కోర్టు నుంచి అనుమతులు లభించడంతో ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే రాష్ట్రంలోని ప్రధాన పట్టణాల్లో రాజకీయ పోరు మొదలుకానుంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి.రాష్ట్రంలో మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థలు ఉండగా, ఇప్పటికే 100 చోట్ల ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. మిగిలిన 23 పట్టణ స్థానిక సంస్థల్లో నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు ఉన్నాయి. మున్సిపల్ కార్పొరేషన్లు:1. శ్రీకాకుళం 2. కాకినాడ 3. రాజమహేంద్రవరం 4. మంగళగిరి-తాడేపల్లి మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు: ఆముదాలవలస, రాజాం, అల్లూరు, బి.కొత్తకోట, తాడిగడప, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, గుడివాడ, చింతలపూడి, నరసరావుపేట, పొన్నూరు, బాపట్ల, పొదిలి, కందుకూరు, గూడూరు, కావలి, శ్రీకాళహస్తి. ఈ 23 పట్టణ స్థానిక సంస్థలకు నవంబర్ 13న నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. నవంబర్ 26న పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. అయితే తుది షెడ్యూల్‌ను రాజ్ఞఐ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.ఇప్పటికే ఆయా మున్సిపాలిటీల్లో మేయర్, చైర్‌పర్సన్, వార్డు స్థానాలకు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయింది. నాలుగు కార్పొరేషన్లలో మొత్తం 260 డివిజన్లు, మిగిలిన 19 పట్టణ స్థానిక సంస్థల్లో 749 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. మరోవైపు అధికార కూటమిలోనూ సీట్ల పంపకాలపై రాజకీయ కసరత్తు జరుగుతోంది. శ్రీకాకుళం, కాకినాడ కార్పొరేషన్లలో జనసేన, రాజమహేంద్రవరంలో బీజేపీ, మంగళగిరి-తాడేపల్లి పరిధిలో టీడీపీ పోటీ చేయనున్నట్లు సమాచారం. మున్సిపాలిటీల్లోనూ మూడు పార్టీల మధ్య స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సీట్ల సర్దుబాటు జరగనుంది.ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయాలతో ఉత్సాహంగా ఉన్న కూటమి పార్టీలు ఈ ఎన్నికల్లోనూ అదే జోరును కొనసాగించాలని భావిస్తున్నాయి. మరోవైపు వైసీపీ కూడా బలమైన అభ్యర్థులను బరిలోకి దింపి కూటమికి గట్టి పోటీ ఇవ్వాలని వ్యూహాలు రచిస్తోంది. దీంతో పెండింగ్‌లో ఉన్న 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు ఏపీ రాజకీయాల్లో మరోసారి వేడిని పెంచనున్నాయి. అభ్యర్థుల ఎంపిక, టికెట్ల కేటాయింపు, ప్రచార వ్యూహాలు రాబోయే రోజుల్లో ఆసక్తికరంగా మారనున్నాయి.

మాటల్లో కాదు... చేతల్లో ఎక్కడ

అమలు కాని జగన్ వ్యూహాలు

గుంటూరు, నవంబర్ 13(జై భీమ్ న్యూస్) :

వైసీపీఅధినేత వైఎస్ జగన్ కార్యకర్తలను దగ్గరకు తీసుకోవడం లేదు. అసలు వారిని గురించి పట్టించుకోవడం లేదు. కేవలం సమావేశాల్లో ప్రసంగాల్లో తప్ప ఆయన స్వయంగా కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన పాపాన పోలేదని వాపోతున్నారు. పార్టీ కోసం ఏమీ ఆశించకుండా పోరాడుతున్న కార్యకర్తలను అధికారంలో ఉన్నప్పుడు అంతే. లేనప్పుడు కూడా తీరు మారకపోవడాన్ని కొందరు తీవ్రంగా తప్పుపడుతున్నారు. మరొకవైపు వైసీపీ కోసం సోషల్ మీడియా కార్యకర్తలతో సమావేశాలను నిర్వహించలేదు. ప్రధాన మీడియాకు పోటీగా కార్యకర్తలు ఎప్పటికప్పుడు సోషల్ మీడియా కార్యకర్తలు పార్టీ కోసం కష్టపడుతున్నా వారిని గుర్తించడం లేదని, కనీసం గుర్తింపు కార్డు కూడా ఇవ్వకపోవడమేంటని వైఎస్ జగన్ ను కొందరు సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు. కార్యకర్తల బీమా పథకాన్నికూడా అమలు చేయడం లేదు. కానీ నిన్న గాక మొన్న వచ్చిన పార్టీలు కూడా బీమా సౌకర్యాలను కల్పిస్తుంటే పార్టీ పెట్టి ఇన్నేళ్లవుతున్నా పట్టించుకోకపోవడాన్ని బట్టి జగన్ కు క్యాడర్ పట్ల ఎంత మమకారం ఉందో అర్థమవుతుందని తెలిపారు. పెట్టుబడి దారులకు రక్షణ చట్టం స్వచ్ఛందంగా పనిచేస్తున్న వారిని... వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ సోషల్ మీడియా విభాగంతో సమావేశం నిర్వహించారు. కానీ వారంతా డబ్బులు తీసుకుని పనిచేసేవారని, అయితే స్వచ్ఛందంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ పై అభిమానంతో కష్టపడుతున్న వారిని మాత్రం గుర్తించడం లేదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా అధ్యక్షుడు దొడ్డ అంజిరెడ్డి తదితర నేతల ఆధ్వర్యంలో సోషల్ మీడియా కార్యకర్తల సమావేశం జరిగిందని, అంతే తప్ప జగన్ ఇందులో పాల్గొనకపోవడాన్ని కూడా తప్పుపట్టింది. 2024న విశాఖపట్నం జిల్లా పెదపాలెంలోని చెన్నాస్




కన్వెన్షన్ హాల్‌లో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో జగన్ ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత ఎక్కడని ప్రశ్నిస్తున్నారు. రాబోయే రోజుల్లో సోషల్ మీడియా వర్కర్లతో ప్రత్యేకంగా ఎక్కడెక్కడ సమావేశాలు నిర్వహిస్తారనే పూర్తి షెడ్యూల్ వివరాలు అందుబాటులో లేవు. ఎంత సేపటికి నియోజకవర్గాల ఇన్ ఛార్జులతోనే సమావేశమవుతున్నారని, పార్టీ గెలుపునకు కష్టపడే వారికి గుర్తింపు దక్కడం లేదని అంటున్నారు. కార్యకర్తలకు బీమా సౌకర్యం కల్పిస్తామని జగన్ ప్రకటన కూడా ఆచరణలో సాధ్యం కావడం లేదని కొందరు సోషల్ మీడియా వేదికగా వాపోతున్నారు. నాడు జగన్ ఏదైనా అనుకోని ఘటనలోనో, ప్రమాదవశాత్తూ మరణించిన వైసీపీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ తరఫున రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించనున్నట్లుఈ ఏడాది సెప్టంబరు లో వైఎస్ జగన్ ప్రకటించారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 1, 2026 నుంచి అమల్లోకి వస్తుందని పార్టీ పేర్కొంది. ఆర్థిక సాయం పొందేందుకు పార్టీ జారీ చేసిన ఐడి కార్డులు మరియు అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుందని చెప్పింది. అయితే ఇప్పటి వరకూ దానిపై ముందడుగు పడలేదని అంటున్నారు. సోషల్ మీడియా వేదికగా అధికార పార్టీ పై పోరు చేస్తున్న కార్యకర్తలకు న్యాయ సహాయం విషయంలో అన్యాయం జరుగుతుందన్నారు. కేసులు ఎదుర్కొంటున్న సోషల్ మీడియా కార్యకర్తలకు పార్టీ తరఫున పూర్తి న్యాయ సహాయం అందిస్తామని, వారి వేధింపులను నమోదు చేసేందుకు 'డిజిటల్ డైరీ'ని ఉపయోగిస్తామని జగన్ చెప్పినా అది పెద్దగా వర్క్ అవుట్ కావడం లేదని అంటున్నారు. జగన్ ఇప్పటికీ మారకపోతే మొన్నటి ఎన్నికల పరిస్థితి తప్పదు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

రబీ సీజన్‌లో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి





రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి -- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
విద్యార్థుల హాజరు 90 శాతానికి పెంచాలి..
విద్యాసంస్థల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి
సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణకు అత్యంత ప్రాధాన్యత.. హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు అభినందనలు

హన్మకొండ, నవంబర్ 13(జై భీమ్ న్యూస్)

రబీ 2026-27 సీజన్‌లో సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేని నేపథ్యంలో వరి సాగును నివారించి, రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఉద్యాన పంటలు, పండ్లు, కూరగాయలు, ఆయిల్‌పామ్ సాగుతో పాటు సూక్ష్మ సేద్యానికి ప్రాధాన్యతనిస్తూ రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక, విద్యాశాఖ, భూసేకరణ, వీధి కుక్కల నియంత్రణ, గ్రామీణాభివృద్ధి పనుల పురోగతిపై నిర్వహించిన దృశ్య మాధ్యమ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రబీ 2026-27 సీజన్‌లో ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేనందున వరి సాగును నివారించాలని తెలిపారు. రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించేందుకు ప్రస్తుత పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు. పంటల వైవిధ్యీకరణ, ఖరీఫ్ పంటల ఉత్పాదకత పెంపు, రైతు గుర్తింపు కార్డుల నమోదు, వ్యవసాయ యంత్ర పరికరాల అద్దె కేంద్రాల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రైవేటు మార్కెట్‌లో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లను జిల్లా కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం విక్రయించినప్పటికీ కనీస మద్దతు ధరతో పాటు ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కనీస మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం విక్రయించి రైతులు నష్టపోయే పరిస్థితి రాకుండా చూడాలని స్పష్టం చేశారు. అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొనుగోళ్లకు సిద్ధంగా ఉంచడంతో పాటు రైతుల వివరాల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని, కొనుగోళ్లు సజావుగా జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

విద్యార్థుల హాజరు 90 శాతానికి పెంచాలి

విద్యాశాఖపై సమీక్షిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది హాజరుపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ముఖ గుర్తింపు హాజరు విధానం ద్వారా హాజరును నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతి పాఠశాలలో విద్యార్థుల హాజరు కనీసం 90 శాతానికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలల వారీగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని సమీక్షించాలని తెలిపారు. ఉపాధ్యాయుల హాజరు మెరుగ్గా ఉంటే విద్యార్థుల హాజరు కూడా పెరుగుతుందని, విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరైతే వారి అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వంటి అంతర్జాల విద్యా వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.

విద్యాసంస్థల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

రూసా 2.0, పీఎం ఉషా పథకాల కింద మొత్తం 41 పనులు మంజూరు కాగా, ఇప్పటివరకు 8 పనులు పూర్తయ్యాయని, మరో 33 పనులు పురోగతిలో ఉన్నాయని ప్రధాన కార్యదర్శి తెలిపారు. మంజూరైన నిధుల్లో ఇప్పటివరకు 41 శాతం మాత్రమే ఖర్చు చేసినందున మిగిలిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల కింద మంజూరైన నిధులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.11 వేల కోట్ల వ్యయంతో 87 యంగ్ ఇండియా వసతి పాఠశాలల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటివరకు రూ.625 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. నిర్మాణ పనులను కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షిస్తూ వేగవంతం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా రూ.1,108 కోట్లతో మంజూరైన 115 తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణకు అత్యంత ప్రాధాన్యత

ప్రభుత్వ అభివృద్ధి పనులు, ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. భూసేకరణకు అవసరమైన నిధులను జిల్లా కలెక్టర్ల వద్ద అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నిర్దిష్ట గడువులోగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అవసరమైతే భూసేకరణకు అదనపు నిధులు కూడా మంజూరు చేస్తామని వెల్లడించారు.

వీధి కుక్కల సమస్యకు పరిష్కారం చూపాలి

గ్రామాలు, పట్టణాల్లో వీధి కుక్కల సమస్యను సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇతర జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో వీధి కుక్కలను గుర్తించి నిబంధనల ప్రకారం పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి

గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణకు ఉపయోగపడే నిర్మాణాలను విస్తృతంగా చేపట్టాలని, గ్రామీణాభివృద్ధి పథకం ద్వారా చేపట్టే పనులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. నీటి సంరక్షణ నిర్మాణాల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు గ్రామాల్లోని కాలువలను శుభ్రం చేసి అవసరమైన పనులను పూర్తిచేయాలని ఆదేశించారు.

హనుమకొండ జిల్లా కలెక్టర్‌ను అభినందించిన ప్రధాన కార్యదర్శి

ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పెంపుదలపై ప్రత్యేక దృష్టి సారించడం వల్ల విద్యార్థుల నమోదు పెరిగిందని వివరించారు. జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల నమోదు పెరగడంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయిని ప్రత్యేకంగా అభినందించారు. వచ్చే విద్యా సంవత్సరంలో కూడా ఇదే విధంగా విద్యార్థుల నమోదును మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గోపాల్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

నీటిని కాపాడితేనే భవిష్యత్తుకు భరోసా..

విద్యార్థులకు డాక్టర్ అనితా రెడ్డి పిలుపు!
హాస్టల్ విద్యార్థులకు అవగాహన కల్పించి నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించిన డాక్టర్ అనితా రెడ్డి



హన్మకొండ, నవంబర్ 13(జై భీమ్ న్యూస్)

నీటి సంరక్షణ, పొదుపుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, నీటిని వృథా చేయకుండా బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. ఆమె ఆధ్వర్యంలో శుక్రవారం బాలసముద్రంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్, ఆనంద నిలయం హాస్టళ్లలో విద్యార్థులకు నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ.. వర్షాలు సకాలంలో కురవకపోవడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల అనేక ప్రాంతాల్లో నీటి కొరత ఏర్పడుతోందని తెలిపారు. భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. హాస్టళ్లలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉంటున్న నేపథ్యంలో నీటి వినియోగం అధికంగా ఉంటుందని, నీటిని వృథా చేయకుండా ఎలా పొదుపు చేయాలనే అంశంపై పిల్లలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. హాస్టళ్లకే పరిమితం కాకుండా కాలనీవాసులకు సైతం నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అవసరమైన మేరకే నీటిని వినియోగించుకోవాలని, నీటి కుళాయిలను నిర్లక్ష్యంగా వదిలేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు వివిధ రకాల మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నీటిని రీసైక్లింగ్ చేయడం, అనవసర వినియోగాన్ని తగ్గించడం ద్వారా నీటి వనరులను కాపాడుకోవచ్చని తెలిపారు. నీటిని నిర్లక్ష్యంగా వినియోగిస్తే భవిష్యత్తు తరాలకు తాగునీరు అందని పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రకృతి సమతుల్యతను కాపాడుతూ పర్యావరణానికి హాని కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని అన్నారు. నీటి సంరక్షణ అనేది ఒక్కరి బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ సమిష్టిగా బాధ్యత తీసుకున్నప్పుడే నీటి కొరతను అధిగమించగలమని డాక్టర్ అనితా రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులచే నీటిని వృథా చేయబోమని, ప్రతి నీటి చుక్కను సంరక్షించుకుంటామని, నీటిని పొదుపుగా వినియోగిస్తూ ఇతరులకు కూడా అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డితో పాటు సరిత, రాఘవ, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

గడువులోగా సీఎంఆర్ బియ్యం అందజేయాలి

డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశం



హన్మకొండ, నవంబర్ 13(జై భీమ్ న్యూస్)

జిల్లాలో ప్రభుత్వానికి బకాయి ఉన్న కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బియ్యాన్ని డిఫాల్ట్ రైస్ మిల్లర్లు నిర్దేశిత గడువులోగా అందజేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. ఈ నెల 30వ తేదీలోగా సీఎంఆర్ బియ్యాన్ని పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి అప్పగించాలని స్పష్టం చేశారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మహేందర్ తదితర అధికారులతో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీఎంఆర్ బియ్యం వంద శాతం బకాయి ఉన్న డిఫాల్ట్ రైస్ మిల్లర్లు, పెనాల్టీ చెల్లింపులు పెండింగ్‌లో ఉన్న రైస్ మిల్లర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన సీఎంఆర్ బియ్యాన్ని నిర్దేశిత గడువులోగా అందజేయడంలో నిర్లక్ష్యం వహించవద్దని మిల్లర్లకు సూచించారు. ప్రభుత్వం విధించిన గడువు ముగిసేలోగా బకాయిలను పూర్తిగా చెల్లించాలని ఆదేశించారు. నిర్దిష్ట గడువులోగా సీఎంఆర్ అందజేయని రైస్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ చట్టం (ఆర్ఆర్ యాక్ట్) ప్రకారం చర్యలు తీసుకొని బకాయిలను రికవరీ చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై డీటీలు నాగేంద్ర ప్రసాద్, భద్రు నాయక్, ఇతర అధికారులు, సంబంధిత రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

రైలులో బాంబ్ ఉందని బెదిరించాడు..

లగేజీ వదిలేసి ఓ వ్యక్తి పరారయ్యాడు

రాయ్ పూర్, నవంబర్ 13(జై భీమ్ న్యూస్)

ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్ రైల్వే స్టేషన్‌లో విచిత్రమైన ఘటన జరిగింది. కోర్బా నుంచి యశ్వంత్‌పూర్ జంక్షన్‌కు వెన్‌గంగా ఎక్స్‌ప్రెస్ రైలు వెళుతోంది. గురువారం మధ్యాహ్నం సమయంలో రాజ్‌నంద్‌గావ్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. అప్పుడు ఓ ప్రయాణికుడు లోకోపైలట్ దగ్గరకు వెళ్లి.. రైలులో బాంబ్ ఉందని సమాచారమిచ్చాడు. పది నిమిషాల్లోనే పేలనుందని చెప్పి.. తన లగేజీని అక్కడే వదిలేసి పారిపోయాడు, లోకోపైలట్ వెంటనే అప్రమత్తమై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాడు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగి.. రైలులో తనిఖీలు చేపట్టాయి. ఎలాంటి పేలుడు పదార్థాలు లేకపోవడంతో.. అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తనిఖీల నేపథ్యంలో గంటన్నర ఆలస్యంగా.. ఆ రైలు తిరిగి బయలుదేరింది. తరువాత సదరు ప్యాసింజర్ తన లగేజీ కోసం స్టేషన్‌కు తిరిగి రాగానే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఐనవోలు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన వరంగల్ సీపీ ఎన్. శ్వేత ఐపీఎస్







భక్తుల మనోభావాలు, ఆచార సంప్రదాయాలను గౌరవిస్తూ మెరుగైన పోలీస్ సేవలు అందించాలి

వరంగల్, నవంబర్ 13(జై భీమ్ క్రైమ్ న్యూస్)

వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపీఎస్ శుక్రవారం ఐనవోలు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న సీపీకి పోలీస్ అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. స్టేషన్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో సీపీ కొబ్బరి మొక్కను నాటారు. తదుపరి పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసుల వివరాలు, నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి విధులు, బాధ్యతలు, పనితీరు, కేసుల దర్యాప్తు పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ ఎన్. శ్వేత మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా ఐనవోలు ప్రాంతంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం ఉన్న నేపథ్యంలో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తుల మనోభావాలు, ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన భద్రతా చర్యలు చేపడుతూ, పోలీస్ శాఖ ప్రతిష్టను కాపాడే విధంగా అంకితభావంతో సేవలు అందించాలని ఆదేశించారు. అలాగే పోలీస్ సిబ్బంది తమ వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విధుల్లో చురుకుదనం, శారీరక దృఢత్వం కోసం ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామునూరు ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సీఐ సంతోష్, ఐనవోలు ఎస్ఐ అశోక్, సంగెం ఎస్ఐ వంశీకృష్ణ, పర్వతగిరి ఎస్ఐ రాజ్‌కుమార్‌తో పాటు ఐనవోలు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భద్రత





ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి - ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

నవంబర్ 19న రాష్ట్రవ్యాప్తంగా పథకం ప్రారంభం..

నవంబర్ 18న గ్రామాల్లో టాంటాం ద్వారా ప్రచారం

18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల కుటుంబ సంపాదన సభ్యుడికి రూ.5 లక్షల బీమా రక్షణ

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్, నవంబర్ 13(జై భీమ్ న్యూస్) :

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ పథకంపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులు సేకరించి, నామినీ వివరాలను కచ్చితత్వంతో నమోదు చేయాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు, ఆర్థిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తదితర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఉప ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా నుంచి కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమైన కార్యక్రమమని, కులం, మతం, ఆదాయంతో సంబంధం లేకుండా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించడమే దీని ప్రధాన ఉద్దేశమని తెలిపారు. దేశంలో మరెక్కడా లేని విధంగా ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ఈ పథకాన్ని రూపొందించినట్లు వివరించారు. నవంబర్ 19న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక జిల్లాలో పథకాన్ని ప్రారంభించనున్నారని, అదే రోజున రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. నవంబర్ 14 నుంచి పథకంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, నవంబర్ 18న ప్రతి గ్రామంలో టాంటాం ద్వారా ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పథకం ఉద్దేశం, ప్రయోజనాలు, దరఖాస్తుల స్వీకరణ విధానం గురించి ప్రతి ఇంటికీ సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. నవంబర్ 19న గ్రామాలు, పట్టణ వార్డుల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. కుటుంబ పెద్ద సూచించిన వ్యక్తిని ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మందిని నామినీలుగా నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ పథకం ద్వారా 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల కుటుంబ సంపాదన సభ్యుడికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి కుటుంబం కూడా అవగాహన లేక పథకం ప్రయోజనాన్ని కోల్పోకుండా అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజ్జు మాట్లాడుతూ దరఖాస్తుల సేకరణ, అర్హుల వివరాల నమోదు, నామినీ వివరాల నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని సూచించారు. ఆధార్ కార్డులో నమోదైన పుట్టిన తేదీని వయస్సు నిర్ధారణకు ప్రామాణికంగా తీసుకోవాలని తెలిపారు. బీమా పొందే వ్యక్తి పేరు, తండ్రి లేదా భర్త పేరు, లింగం, ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, కుటుంబ సభ్యుల వివరాలు, వారి ఆధార్ నంబర్లతో పాటు జిల్లా, మండలం, గ్రామం లేదా పట్టణ వార్డు వివరాలను తప్పనిసరిగా సేకరించాలని చెప్పారు. ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను ప్రతిపాదించినప్పుడు వారి వాటాలను స్పష్టంగా నమోదు చేయాలని, నామినీ మైనర్ అయితే గార్డియన్ వివరాలను కూడా పొందుపరచాలని సూచించారు. దరఖాస్తుదారుడి సంతకంతో పాటు సంబంధిత ధ్రువీకరణ అధికారి సంతకం ఉండేలా చూడాలన్నారు. సంతకం చేసిన దరఖాస్తులను స్కాన్ చేసి డిజిటల్ విధానంలో బీమా సంస్థకు పంపించాలని, అసలు దరఖాస్తులను జిల్లా స్థాయిలో భద్రపరచాలని ఆదేశించారు. రాబోయే 15 నుంచి 20 రోజుల పాటు యుద్ధప్రాతిపదికన ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులు, నామినీ వివరాలు సేకరించి డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. ఏ ఒక్క కుటుంబం కూడా నమోదు ప్రక్రియలో మిగిలిపోకుండా జిల్లా స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. బీమా పొందిన వ్యక్తి మరణించిన సందర్భంలో నామినీకి రూ.5 లక్షల పరిహారం అందించే ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని సీఎస్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, సీపీఓ, డీఆర్డీఓ అధికారులు సమన్వయంతో క్లెయిమ్‌ల పరిశీలన, ధ్రువీకరణ చేపట్టాలని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో వార్డు అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మెప్మా అధికారులు, కార్పొరేషన్లలో సంబంధిత అధికారులు క్లెయిమ్‌ల పరిష్కారాన్ని పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్యవేక్షణలో సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ దరఖాస్తులు, క్లెయిమ్‌ల వివరాలు, పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో పాటు అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జడ్పీ సీఈఓ వసంత, డీఆర్డీఓ నాగ పద్మజ, డీపీఓ కల్పన, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ప్రసన్నతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏపీలో ఈ మూడు నగరాలు

జాతీయ స్థాయిలో రికార్డులు

విశాఖపట్టణం, నవంబర్ 13(జై భీమ్ న్యూస్) :

కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతి ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్ పరిశుభ్రత సర్వే ఫలితాలను వెల్లడిస్తుంటుంది. దేశంలో పరిశుభ్రతను పెంపొందించడం.. స్వచ్ఛతను కాపాడటం దీని వెనుక ఉన్న ఉద్దేశం. పరిశుభ్రమైన నగరాల జాబితాను ప్రకటించి.. వాటికి ప్రోత్సాహకాలను కేంద్రం అందిస్తూ ఉంటుంది. ఈసారి కేంద్రం ప్రకటించిన జాతీయ ర్యాంకింగ్ ల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని మూడు పట్టణాలు కీలక స్థానాలలో నిలిచాయి. తద్వారా ఏపీలో మూడు పట్టణాల గురించి జాతీయస్థాయిలో చర్చ నడుస్తోంది. ఇదే సమయంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలు.. అమలు చేస్తున్న విధానాలను ఇతర రాష్ట్రాలు అధ్యయనం చేస్తున్నాయి.కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సర్వే ఫలితాల ప్రకారం దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా మహారాష్ట్రలోని నవి ముంబై నిలిచింది. రెండో స్థానంలో గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ నగరం నిలిచింది. ఇక మూడో స్థానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ నిలిచింది.దక్షిణాది ప్రాంతాలలో విజయవాడ కంటే ఎన్నో పెద్ద నగరాలు ఉన్నాయి. హైదరాబాద్.. చెన్నై.. బెంగళూరు.. తిరువనంతపురం వంటి నగరాలు ఉన్నప్పటికీ.. వాటన్నిటిని దాటేసి విజయవాడ దేశంలోనే మూడవ స్వచ్ఛ నగరంగా ఎదగడం అంటే మామూలు విషయం కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖపట్నంలో పరిశుభ్రత మీద ప్రధానంగా ఫోకస్ చేసింది. తడి చెత్త.. పొడి చెత్తను వేరువేరుగా సేకరిస్తుంది. గతంలో టిడిపి ప్రభుత్వం అధికారం ఉన్నప్పుడు నిర్మించిన కేంద్రాలను మరోసారి పునరుద్ధరించింది. చెత్త సేకరణ వాహనాలను పెంచింది. రోడ్లమీద చెత్త వేయకుండా ఎక్కడికక్కడ కుండీలను ఏర్పాటు చేసింది. తద్వారా విజయవాడ నగరం స్వచ్ఛతను సంతరించుకుంది. ఇటీవల కాలంలో ప్రభుత్వం విజయవాడ నగరం మీద మరిత ఫోకస్ చేయడంతో నగరం పరిశుభ్రంగా కనిపిస్తోంది. అందువల్లే అత్యంత పరిశుభ్రమైన నగరంగా విజయవాడ మూడో స్థానంలో నిలిచింది.ఇక జనాభా పరంగా చూసుకుంటే గ్రేటర్ విశాఖపట్నం మొదటి స్థానంలో గెలిచింది. 10 లక్షలు అంతకుమించిన జనాభా ఉన్న నగరాల జాబితాలో విశాఖపట్నం మొదటి స్థానంలో ఉంది. విశాఖపట్నం తర్వాత మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్పూర్ రెండవ స్థానం.. ఉత్తరప్రదేశ్‌లోని లక్నో మూడో స్థానంలో ఉన్నాయి. జీవనానికి అనుకూలమైన పరిస్థితులు.. ఉపాధి అవకాశాలు.. ప్రభుత్వ అనుకూల నిర్ణయాల వల్ల విశాఖపట్నంలో జనాభా వృద్ధి చెందుతోంది. స్థానికులే కాకుండా.. ఇక్కడ అనేక రకాల ప్రాంతాలకు చెందినవారు జీవిస్తున్నారు. రకరకాల పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. ముఖ్యంగా ఐటి.. ఫార్మా.. లాజిస్టిక్స్.. వంటి రంగాలలో విశాఖపట్నం వృద్ధిని సాగిస్తోంది. ప్రభుత్వం కూడా ఐటీ పరంగా విశాఖపట్నం నగరానికి ప్రాధాన్యం ఇవ్వడంతో.. వృద్ధి వేగంగా సాగిపోతోంది. ఇతర ప్రాంతాల వారు ఇక్కడ వచ్చి నివసించడానికి ప్రధాన కారణం కూడా అదే. అందువల్లే విశాఖపట్నం దేశంలోనే అత్యధిక జనాభా ఉన్న నగరంగా ఆవిర్భవించింది.మూడు నుంచి పది లక్షల జనాభా ఉన్న నగరాలలో గుంటూరు మూడో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని మొదటి స్థానంలో ఉంది. పంజాబ్‌లోని చండీగఢ్ రెండవ స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు మూడో స్థానంలో ఉంది.. గుంటూరు నగరంలో ఈ స్థాయిలో జనాభా అభివృద్ధి చెందడానికి ప్రధాన కారణం ఇక్కడ లభిస్తున్న ఉపాధి అవకాశాలు. స్థానికంగా అనుకూలంగా ఉన్న వనరులు.. ప్రభుత్వ విధానాలు కూడా అనుకూలంగా ఉండడంతో ఇక్కడికి చాలామంది వచ్చి ఉపాధి పొందుతున్నారు.గతంలో కేంద్రం విడుదల చేసే జాబితాలో ఆంధ్రప్రదేశ్ నుంచి అంతగా ప్రాధాన్యం లభించేది కాదు. కానీ ఈసారి విజయవాడ.. విశాఖపట్నం.. గుంటూరు వంటి ప్రాంతాలకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ మూడు ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా చేపడుతోంది. వాటి ఫలితాలు కూడా కళ్ళ ముందు కనిపిస్తున్నాయి. అందువల్లే ఈ మూడు నగరాలు జాతీయస్థాయిలో గుర్తింపు సాధించాయి. ఈ మూడు నగరాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి.. సామాజిక అభివృద్ధికి.. పట్టుకొమ్మలు.



అయ్యప్ప స్వాములకు నిత్య అన్నదానం.. సేవాభావంతో సర్పంచ్ కిరణ్ కుమార్!

సొంత ఖర్చులతో అన్నప్రసాద వితరణకు శ్రీకారం.. గంగారం తండాలో భక్తులకు ఆధ్యాత్మిక సేవ

కారేపల్లి, నవంబర్ 13(జై భీమ్ న్యూస్) :

భక్తి భావంతో పాటు సేవా దృక్పథాన్ని చాటుకుంటూ సింగరేణి మండలం గంగారం తండా గ్రామ సర్పంచ్ నునావత్ కిరణ్ కుమార్ ప్రత్యేక సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అయ్యప్ప మాలధారణ చేసి మండల దీక్షలో ఉన్న స్వాములకు తన సొంత ఖర్చులతో ప్రతిరోజూ అన్నదానం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు.అయ్యప్ప స్వాముల దీక్షా కాలంలో భక్తులకు అన్నప్రసాదం అందించాలనే సంకల్పంతో ఈ నిత్య అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తి మార్గంలో అన్నదానం అత్యంత పవిత్రమైన సేవగా భావిస్తూ, స్వాములకు ఆహారం అందించడం ద్వారా ఆధ్యాత్మిక సేవలో తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. స్వాములకు అన్నప్రసాదం అందించడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పదవిని ప్రజాసేవకే కాకుండా ఆధ్యాత్మిక సేవకు కూడా వేదికగా మలుచుకుంటూ సర్పంచ్ కిరణ్ కుమార్ చేస్తున్న ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు, అయ్యప్ప భక్తులు అభినందిస్తున్నారు. అన్నదానం మహాదానం అనే మాటకు నిదర్శనంగా సాగుతున్న ఈ సేవా కార్యక్రమం గంగారం తండాలో భక్తి భావాన్ని, సేవా స్ఫూర్తిని చాటుతోంది.

ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న బోరుకు పునర్జీవం!

డోర్నకల్ బైపాస్ రోడ్డులో బోరుకు మరమ్మతులు..

తిరిగి అందుబాటులోకి నీటి వసతి

కారేపల్లి, నవంబర్ 13(జై భీమ్ న్యూస్) :

ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రామపంచాయతీ పాలకవర్గం ముందస్తు చర్యలు చేపట్టింది. డోర్నకల్ బైపాస్ రోడ్డులోని రైస్ మిల్లు సమీపంలో గత కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉన్న బోరును గుర్తించి మరమ్మతులు చేయించడంతో తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చారు. దీంతో స్థానికులకు నీటి వసతి అందుబాటులోకి వచ్చింది. అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ, నిరుపయోగంగా ఉన్న బోర్లను పునరుద్ధరించడం ద్వారా ప్రజలకు నీటి ఇబ్బందులు కలగకుండా చూడాలనే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టారు. నీటి సమస్యలు తలెత్తిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే అందుబాటులో ఉన్న వనరులను సిద్ధం చేసుకోవడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడవచ్చని గ్రామపంచాయతీ పాలకవర్గం పేర్కొంది. ఏళ్ల తరబడి ఉపయోగంలో లేకుండా ఉన్న బోరును తిరిగి అందుబాటులోకి తీసుకురావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేదరి టోనీ,ఉపసర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి, వార్డు సభ్యుడు ఆదర్ల అంజయ్య, పంచాయతీ కార్యదర్శి నెహ్రూ పాల్గొన్నారు.

అమెరికాలో ఇళ్ల అమ్మకాలు డౌన్..

16 ఏళ్ల కనిష్టానికి విక్రయాలు.. ధరలు మాత్రం పైపైకే!

- అక్టోబర్‌లో 5.5% మేర తగ్గిన విక్రయాలు

- అమ్మకాలు తగ్గినా ఆగని ధరల పెరుగుదల.. - వరుసగా 40వ నెలలోనూ పైపైకే

- వడ్డీ రేట్లు తగ్గితే డిమాండ్ భారీగా పుంజుకుంటుందని నిపుణుల అంచనా

అమెరికాలో గృహ విక్రయ రంగం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. మార్ట్‌గేజ్ వడ్డీ రేట్లు రికార్డు స్థాయిలో పెరగడంతో ఇళ్ల అమ్మకాలు గత 16 ఏళ్లలో ఎన్నడూ లేనంత కనిష్ట స్థాయికి పడిపోయాయి. అయితే, అమ్మకాలు భారీగా తగ్గినప్పటికీ, ఇళ్ల ధరలు మాత్రం పైపైకే వెళ్తుండటం గమనార్హం. ఈ వింత పరిస్థితి కొనుగోలుదారులను తీవ్ర గందరగోళానికి గురిచేస్తోంది. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ రియల్టర్స్ (ఎన్ఏఆర్) గురువారం విడుదల చేసిన నివేదిక ప్రకారం.. అక్టోబర్‌లో పాత ఇళ్ల అమ్మకాలు సెప్టెంబర్‌తో పోలిస్తే 5.5% తగ్గి, వార్షిక రేటు 3.75 మిలియన్లకు పడిపోయాయి. గత ఏడాది అక్టోబర్‌తో పోలిస్తే ఇది 8.8% తక్కువ. 2010 ఆగస్టు తర్వాత ఇదే అత్యంత తక్కువ అమ్మకాల రేటు కావడం గమనార్హం. ఒకవైపు అమ్మకాలు పడిపోతున్నా, మరోవైపు ధరలు తగ్గకపోవడం మార్కెట్‌లో నెలకొన్న విచిత్ర పరిస్థితిని తెలియజేస్తోంది. దేశవ్యాప్తంగా ఇళ్ల సగటు ధర గత ఏడాదితో పోలిస్తే 0.4% పెరిగి 416,700 డాలర్లకు చేరింది. ఇలా ధరలు పెరగడం ఇది వరుసగా 40వ నెల. ఈ పరిస్థితిపై ఎన్ఏఆర్ చీఫ్ ఎకానమిస్ట్ లారెన్స్ యున్ స్పందిస్తూ.. “2000 సంవత్సరం తర్వాత మార్ట్‌గేజ్ వడ్డీ రేట్లు ఈ స్థాయిలో పెరగడం ఇదే మొదటిసారి. అందుకే ఇల్లు కొనడం చాలా కష్టంగా మారింది. ఫలితంగా, అమ్మకాలు దశాబ్దకాలంలో కనిష్ట స్థాయికి చేరాయి” అని వివరించారు. దేశంలోని మిడ్‌వెస్ట్, సౌత్, వెస్ట్ ప్రాంతాల్లో అమ్మకాలు క్షీణించగా, నార్త్ ఈస్ట్‌లో స్థిరంగా ఉన్నాయి. అమ్మకాలు మందగించడంతో మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ఇళ్ల సంఖ్య (ఇన్వెంటరీ) పెరిగింది. ప్రస్తుతం 1.59 మిలియన్ల ఇళ్లు అమ్మకానికి ఉన్నాయి. ఇది 5.1 నెలల సప్లైకి సమానం. అయితే, సప్లై పెరిగినప్పటికీ ధరలు తగ్గకపోవడానికి బలమైన కారణం ఉందని నిపుణులు అంటున్నారు. ఇప్పటికే ఇళ్లు ఉన్న యజమానులు ఆర్థికంగా బలంగా ఉన్నారని, ఆస్తుల విలువ పెరగడంతో వారు తక్కువ ధరలకు అమ్మడానికి ఇష్టపడటం లేదని లారెన్స్ యున్ తెలిపారు. మొత్తం లావాదేవీలలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా అమ్మిన ఇళ్లు కేవలం 2% మాత్రమే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో మార్ట్‌గేజ్ వడ్డీ రేట్లు తగ్గితే, ఇల్లు కొనాలని వేచి చూస్తున్న వారి నుంచి భారీ డిమాండ్ (పెంట్-అప్ డిమాండ్) పుంజుకునే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. ప్రస్తుతం మాత్రం అధిక ధరలు, వడ్డీ రేట్ల కారణంగా కొనుగోలు శక్తి అన్ని ప్రాంతాల్లోనూ గణనీయంగా తగ్గిందని అన్నారు.

రాజస్థాన్‌లో 3 రకాల ఓటర్ల జాబితాలు..

సర్‌తో పోలిస్తే ఎస్ఎస్ఆర్‌లో 11 లక్షల మంది అధిక ఓటర్లు

జైపూర్, నవంబర్ 13(జై భీమ్ న్యూస్) :

రాజస్థాన్ లో మూడు రకాల ఓటర్ల జాబితా తయారైంది. దీంతో అధికారులు తికమకపడుతున్నారు. తాజాగా 2027 స్పెషల్ సమ్మరీ రివిజన్ కింద గురువారం కొత్త ఓటర్ల జాబితాను ప్రచురించారు. ఆ జాబితా ప్రకారం రాజస్థాన్‌లో ఓటర్ల సంఖ్య 5.26 కోట్లుగా నమోదు అయ్యింది. ఇక ఈ ఏడాది ఫిబ్రవరిలోనే నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో ఆ రాష్ట్రంలో 5.15 కోట్ల ఓటర్లు ఉన్నట్లు నమోదు అయ్యింది. ఈ రెండు రకాల ఓటర్ల జాబితా మాత్రమే కాదు.. రాజస్థాన్‌లో మూడో ఓటరు లిస్టు కూడా ఉన్నది. ఆ రాష్ట్ర ఎన్నికల సంఘం తుది ఎన్నికల జాబితాలో 5.45 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఆ జాబితాను అక్టోబర్‌లో రిలీజ్ చేశారు. అయితే రాజస్థాన్‌లో మూడు రకాల ఓటర్ల జాబితా ఉండడం, ఆ మూడింటి మధ్య ఓటర్ల సంఖ్యలో తేడా ఉండడం .. అధికారులను కన్ఫ్యూజ్ చేస్తోంది. కేవలం ఏడాది వ్యవధిలోనే మూడు రకాల ఓటర్ల జాబితాను రాజస్థాన్‌లో తయారుకావడం గమనార్హం. ఎస్ఐఆర్ ప్రకారం 5.15 కోట్లు, ఎస్ఈసీ ప్రకారం 5.45 కోట్లు, ఎస్-ఎస్ఆర్ డ్రాఫ్ట్‌లో 5.26 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. మూడు జాబితాల్లో వ్యత్యాసం భారీగా ఉండంతో.. ఆ తేడా ఎందుకు వచ్చిందన్న ఆందోళనలో అధికారులు ఉన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE | సమస్యలపై సమరంగా | Jai Bheem TV | సామాన్యుడి ఆయుధంగా

రియాలిటీ' సినిమాని థియేటర్లలో హ్యాపీగా ఎంజాయ్ చేస్తారు

హీరో, డైరెక్టర్ కిరణ్ అబ్బవరం

వరుస బ్లాక్‌బస్టర్స్‌తో అలరిస్తున్న యంగ్ హీరో కిరణ్ అబ్బవరం తన ప్రతిష్టాత్మక చిత్రం 'రియాలిటీ'తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమా కోసం కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా రచయితగా, దర్శకుడిగా కూడా బాధ్యతలు చేపట్టారు. ప్రతి విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, అన్ని వయసుల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఒక మంచి ఎంటర్‌టైనర్‌ను తీర్చిదిద్దుతున్నారు. ఆయన కెరీర్‌లోనే భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి నిర్మిస్తున్నారు. సురేష్ యెర్రా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని పెంచింది. గ్లింప్స్‌కు ఫీల్ గుడ్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో మంచి స్పందన రాగా, ఫస్ట్ సింగిల్ భజ గోవిందం చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. జీవితంలో చిన్న చిన్న విషయాల్లోనే ఆనందాన్ని వెతుక్కోవాలనే అందమైన భావనతో రూపొందిన ఈ పాట శ్రోతలకు వెంటనే కనెక్ట్ అయి వైరల్‌గా మారింది.

ఇప్పుడు మ్యూజికల్ ఎక్స్‌పీరియన్స్‌ను మరోస్థాయికి తీసుకెళ్తూ మేకర్స్ రెండో సింగిల్ 'రుత్తూ'ను విడుదల చేశారు. ఈ పాట 'రియాలిటీ'లోని రొమాంటిక్ కోణాన్ని అందంగా ఆవిష్కరిస్తుంది. వినసొంపైన మెలోడీగా, మనసుకు హాయినిచ్చేలా ఈ పాట సాగుతుంది. భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం కొత్త అనుభూతిని ఇస్తుంది. అద్భుతమైన ఇన్‌స్ట్రుమెంటేషన్ పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చింది. పూర్ణాచారి రాసిన సాహిత్యం కవితాత్మకంగా సాగుతూ, తన ప్రేయసిపై హీరోకు ఉన్న ప్రేమను, ఆమెతో ఉన్నప్పుడు కలిగే ఆనందాన్ని, ప్రతి క్షణం ఆమెతోనే గడపాలనే ఆరాటాన్ని అందంగా ఆవిష్కరించింది. ప్రేమలోని భావాలను వ్యక్తపరిచిన తీరు మరింత అందంగా చూపిస్తుంది.

కపిల్ కపిలన్ బ్యూటీఫుల్ వోకల్స్ పాటకు మరింత ప్రాణం పోశారు. ఎం. షరీఫ్ చేసిన గ్రేస్‌ఫుల్ కొరియోగ్రఫీ ఆకట్టుకుంది. చాలా సింపుల్ మూవ్‌మెంట్స్ కూడా ఎంతో అందంగా కనిపించాయి. ముఖ్యంగా పాటలోని క్యాచీ హుక్ స్టెప్ సోషల్ మీడియా రీల్స్, షార్ట్స్‌లో ట్రెండ్ అయ్యేలా ఉంది.

కిరణ్ అబ్బవరం తన పాత్రలో పూర్తిగా ఒదిగిపోయారు. పక్కింటి కుర్రాడిలా కనిపించే పాత్రలో తనదైన చార్మ్‌తో ఆకట్టుకున్నారు. దేవిక భట్ అందంగా కనిపిస్తూ, తన స్క్రీన్ ప్రెజెన్స్, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో పాటకు మరింత మ్యాజిక్ తీసుకొచ్చారు. వీరిద్దరి కెమిస్ట్రీ ఈ పాటలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కిరణ్ తన ఆనందాన్ని వ్యక్తపరచడం, దేవికకు పానీపూరీ తినిపించడం వంటి చిన్న చిన్న మూమెంట్స్ కూడా ఎంతో ముచ్చటగా అనిపిస్తాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ప్రేమకథలోని మ్యాజిక్ ప్రేక్షకులకు ఒక అందమైన అనుభూతిని అందిస్తుంది.

మొత్తంగా 'రుత్తూ' విజువల్స్ పరంగా కూడా ఒక మంచి మ్యూజికల్ ట్రీట్. వెంటనే ఆకట్టుకునే మెలోడీ, క్యూట్ రొమాంటిక్ మూమెంట్స్‌తో ఈ పాట ఫస్ట్ సింగిల్‌లాగే మరోసారి వైరల్ కానుంది. 'రియాలిటీ' మ్యూజికల్ ప్రమోషన్స్ వరుసగా ఆకట్టుకుంటుండటం చూస్తుంటే, ఈ సినిమా ప్రతి విషయంలోనూ కిరణ్ అబ్బవరం ఎంత ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారో అర్థమవుతోంది.



ఈ సినిమాలో శరత్ కుమార్, సాయి కుమార్, రోహిణి, అన్నపూర్ణమ్మ, సుదర్శన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

విశ్వాస్ డేనియల్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. సుధీర్ మాచర్ల ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సంతోష్ నాయుడు ఎడిటర్‌గా, రాజేష్ కామార్సు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. క్రిస్మస్ కానుకగా 'రియాలిటీ' చిత్రం డిసెంబర్ 25, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

సాంగ్ లాంచ్ ఈవెంట్ లో హీరో, డైరెక్టర్ కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. . 'ఎస్ఆర్ కళ్యాణ మండపం' తర్వాత మరో మంచి కథ చెప్పాలని ఎప్పుడూ ఉండేది. కంటిన్యూగా నేను హీరోగా చేస్తున్న సినిమాలు అద్భుతంగా ఆడుతున్నాయి. మీరందరూ నన్ను అభిమానిస్తున్నారు. ఎక్కడికి వెళ్లినా సరే, నేను కోరుకున్న దానికంటే ఎక్కువ అభిమానం, ప్రేమ దొరుకుతున్నాయి. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి చాలా ప్రేమ, ఆదరణ లభించింది. అందుకే ఒక మంచి ఫ్యామిలీ కథ చేయాలనిపించింది. కుటుంబం అంతా కలిసి ఇలాంటి ఒక సినిమా చూస్తే బాగుంటుందనిపించి ఈ కథ రాశాను. ఇప్పటివరకు వచ్చిన కంటెంట్‌ను ఆడియన్స్ చాలా అద్భుతంగా ఆదరించారు.. అలాగే 'భజగోవిందం' పాట కూడా అందరికీ నచ్చింది. 'రుత్తు' పాట కూడా మీ అందరికీ నచ్చిందని అనుకుంటున్నాను. సినిమా కూడా మీ అందరికీ నచ్చాలని కోరుకుంటున్నాను.'భజగోవిందం' పాటను సనారే అద్భుతంగా రాశారు. ఆ పాట నచ్చితే 'రియాలిటీ' సినిమా కూడా మీకు నచ్చుతుందని అనుకుంటున్నాను. అలాగే పూర్ణాచారి ఈ రెండో పాటకు అద్భుతమైన లిరిక్స్ ఇచ్చారు. భీమ్స్ అన్న ప్రతి పాటను అద్భుతంగా చేశారు. మేము అడిగిన దానికంటే ఇంకా బాగా ఇచ్చారు. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఔట్‌పుట్ పరంగా, బిజినెస్ పరంగా మేము చాలా హ్యాపీగా ఉన్నాము. డిసెంబర్ 25న సినిమాను రిలీజ్ చేస్తున్నాము. మీ అందరికీ నచ్చాలని కోరుకుంటున్నాను. 'భజగోవిందం' పాటను ఇంత అద్భుతంగా ఆదరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. మీరంతా హ్యాపీగా థియేటర్లకు వెళ్లండి. కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు. అందరికీ ధన్యవాదాలు.

ప్రొడ్యూసర్ సుధాకర్ చాగంటి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఇరవై ఏళ్ళుగా పరిశ్రమలో ఉన్నాము. సినిమా చేయాలని అనుకున్నప్పుడు మంచి కుటుంబ విలువలతో కూడిన కథ చేయాలని భావించాము. కిరణ్ గారు చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. 53 రోజుల్లో షూటింగ్ పూర్తి చేశాము. చాలా అద్భుతమైన క్వాలిటీతో సినిమా వచ్చింది. ప్రతి డైలాగ్ చాలా బ్యూటిఫుల్‌గా ఉంటుంది. చాలా అద్భుతంగా రాశారు. నా తొలి సినిమాను కిరణ్ అబ్బవరం హీరో, ఆయన దర్శకత్వంలో చేయడం నాకు చాలా ఆనందంగా ఉంది. 'భజగోవిందం' పాట ప్రతి ఇంటికీ చేరువైంది. చాలామంది తమ స్టేటస్‌లో కూడా పెట్టుకుని అప్రిషియేట్ చేస్తున్నారు. చాలా విలువ ఉన్న కథ ఇది. ఆ కథకు తగ్గట్టుగానే ఆ పాటను చేశాము. భీమ్స్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ఇంకా మంచి పాటలు ఉన్నాయి. మంచి మంచి కమర్షియల్ సాంగ్స్ ఉన్నాయి. ఆల్బమ్ చాలా అద్భుతంగా ఉండబోతుంది. బిజినెస్ కూడా క్లోజ్ అయింది. డిసెంబర్ 25వ తేదీన సినిమాను చాలా గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాము.

హీరోయిన్ దేవికా మాట్లాడుతూ.. ఇది నా తొలి సినిమా. నాకు చాలా ప్రత్యేకమైనది. బిగ్ స్క్రీన్ మీద నన్ను నేను చూసుకోవడం చాలా ఆనందంగా ఉంది. 'భజగోవిందం' పాట చాలా పెద్ద హిట్ అయింది. రెండో పాటకు కూడా మీ నుంచి అలాంటి ఆదరణ లభిస్తుందని కోరుకుంటున్నాను. ఇలాంటి మంచి సినిమాలో పని చేసే అవకాశం ఇచ్చిన మా దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. అందరూ మా సినిమాను థియేటర్లలో చూసి సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాను.

డీవోపీ విశ్వాస్ డానియల్ మాట్లాడుత.. ఇప్పటికే మీరు 'భజగోవిందం' పాట చూశారు. సినిమాలో కూడా అలాంటి మ్యూజిక్ ఉంటుంది. కిరణ్ అబ్బవరం గారు ఈ సినిమాలో ప్రతి క్యారెక్టర్‌ను అద్భుతంగా డిజైన్ చేశారు. ఇది మనందరం రిలేట్ చేసుకునే కథ. ఈ సినిమాలో ఆయనలోని రచయిత నాకు ఎంతగానో నచ్చారు. ఇలాంటి కథను అందరూ రాయలేరు. ఇలాంటి అద్భుతమైన కథను తీసుకొస్తున్న కిరణ్ గారికి ధన్యవాదాలు.

లిరిక్ రైట పూర్ణాచారి మాట్లాడుతూ.. సనారే రాసిన 'భజగోవిందం' పాట చాలా పెద్ద హిట్ అయింది. రెండో పాట రాసే బాధ్యతను నాకు కిరణ్ అబ్బవరం గారు ఇచ్చారు. ప్రేమలో ఒక మ్యాజిక్‌ను క్రియేట్ చేసేలా ఈ పాటను రాయడం జరిగింది. 'రియాలిటీ' మన ఇంటి కథ, మనందరి కథ. తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది.

లిరిక్ రైటర్ సనారే మాట్లాడుతూ.. ఇందులో 'భజగోవిందం' పాట రాశాను. ఆ పాట అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. నా జీవితంలో ఇదొక హై మూమెంట్. 'భజగోవిందం' పాట నాకు ఒక విజిటింగ్ కార్డులా మారింది. నాకు ఈ అవకాశం ఇచ్చిన హీరో కిరణ్ అన్నకి చాలా రుణపడి ఉంటాను. ఈ వేడుకలో సినిమా యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

నటీనటులు: కిరణ్ అబ్బవరం, దేవిక భట్, శరత్ కుమార్, సాయి కుమార్, రోహిణి, అన్నపూర్ణమ్మ, సుదర్శన్ తదితరులు.

హైందవ' మూవీ నుంచి రొమాంటిక్ మెలోడీ 'ఎవరైనా' రిలీజ్



'కిష్కింధపురి' బ్లాక్‌బస్టర్ విజయంతో జోష్ లో ఉన్న యాక్షన్ హల్క్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఆకల్ట్ థ్రిల్లర్ 'హైందవ'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. నూతన దర్శకుడు లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో, మూన్‌షైన్ పిక్చర్స్ బ్యానర్‌పై మహేష్ చందు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంయుక్త హీరోయిన్ గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదల టీజర్ సినిమాపై అంచనాలు పెంచింది. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'ఎవరైనా' ను విడుదల చేశారు. ప్రేమ, భావోద్వేగాలను కలిపి రూపొందించిన ఈ పాట వినగానే ఆకట్టుకుంటుంది. సామ్ సీఎస్ అద్భుతమైన ట్యూన్ కంపోజ్ చేశారు. మెలోడీ ట్యూన్, చక్కటి లిరిక్స్‌తో పాట మొదటిసారి విన్నప్పుడే కనెక్ట్ అయ్యేలా ఉంది. కపిల్ కపిలన్, శ్వేతా మోహన్ తమ వాయిస్‌తో పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు. కిట్టు విస్సాప్రగడ అందించిన సాహిత్యం పాటకు మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. పాటలోని విజువల్స్ కూడా చాలా ఆహ్లాదకరంగా ఉన్నాయి. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, సంయుక్త మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకుంది. లీడ్ పెయిర్ మధ్య కనిపించే మ్యాజిక్, వారి స్క్రీన్ ప్రెజెన్స్ పాటను మరింత ఆకట్టుకునేలా చేశాయి. 'ఎవరైనా' పాట 'హైందవ' ఆల్బమ్‌పై అంచనాలు పెంచుతోంది. ఇప్పటికే టీజర్‌తో ఆసక్తి కలిగించిన ఈ సినిమా, ఇప్పుడీ మెలోడీతో అంచనాలు పెంచింది. ఈ చిత్రంలో మహేష్ మంజ్రేకర్, సౌరభ్ సచ్‌దేవా, జేడీ చక్రవర్తి, శివాజీ రాజా కీలక పాత్రలు పోషిస్తున్నారు. హరీష్ కన్నన్ డీవోపీగా పని చేస్తున్నారు, కార్తిక శ్రీనివాస్ ఆర్ ఎడిటర్, శివ కామేష్ డి ప్రొడక్షన్ డిజైనర్. 'హైందవ' నవంబర్ 27న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. నటీనటులు: బెల్లంకొండ సాయి శ్రీనివాస్, సంయుక్త, మహేష్ మంజ్రేకర్, సౌరభ్ సచ్‌దేవా, జేడీ చక్రవర్తి, శివాజీ రాజా, గెటప్ శ్రీను.

అల్లు అర్జున్ భార్య స్నేహారెడ్డికి అరుదైన గౌరవం



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ భార్య, వ్యాపారవేత్త అల్లు స్నేహారెడ్డికి కళా, సాంస్కృతిక రంగాల్లో అరుదైన గౌరవం దక్కింది. ప్రతిష్టాత్మక 'బౌలీ ఆర్ట్ సంఘం' కల్చర్ అండ్ హెరిటేజ్ విభాగానికి ఫౌండింగ్ చైర్‌పర్సన్‌గా ఆమె నియమితులయ్యారు. భారతదేశంలోనే మొట్టమొదటి 'స్టెప్‌వెల్ ఆర్ట్ బినాలే'గా గుర్తింపు పొందిన ఈ ఉద్యమానికి ఆమె ప్రధాన సారథిగా వ్యవహరించనున్నారు. దక్కన్ ప్రాంతంలో, ముఖ్యంగా హైదరాబాద్ పరిసరాల్లో ఉన్న పురాతన మెట్ల బావుల (బావోలీలు) చారిత్రక, పర్యావరణ విశిష్టతను నేటి తరానికి చాటిచెప్పడమే ఈ సంస్థ ప్రధాన లక్ష్యం. 'ది రెయిన్‌వాటర్ ప్రాజెక్ట్'కు చెందిన కల్పనా రమేశ్, 'ఏక్ చిత్ర'కు చెందిన అన్నపూర్ణ మాదిపాడిగ సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. ఈ పురాతన బావులను కళా వేదికలుగా తీర్చిదిద్ది ప్రజల్లో అవగాహన పెంచేందుకు స్నేహారెడ్డిని ఈ ప్రాజెక్ట్ ముఖచిత్రంగా ఎంపిక చేశారు. ఈ క్రమంలో డిసెంబర్ 1వ తేదీ నుంచి జనవరి 10 వరకు దాదాపు 40 రోజుల పాటు భారీ స్థాయిలో బౌలీ ఆర్ట్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. బన్సీలాల్‌పేట్, గోల్కొండ, రాష్ట్రపతి నిలయం, ఫలక్‌నుమా తదితర 13కు పైగా చారిత్రక ప్రాంతాల్లో 200 మందికి పైగా కళాకారులతో ప్రదర్శనలు, చర్చలు ఏర్పాటు చేయనున్నారు. ఈ బాధ్యతలపై స్నేహారెడ్డి స్పందిస్తూ... "బౌలీ ఆర్ట్ సంఘంలో ఈ కొత్త బాధ్యత చేపట్టడం చాలా సంతోషంగా ఉంది. మన నగరం యొక్క చరిత్ర, వారసత్వ సంపదపై ముఖ్యంగా యువతరంలో మరింత అవగాహన పెంచేందుకు ఈ ప్రాజెక్ట్ ఒక గొప్ప వేదికగా నిలుస్తుంది. భావితరాల కోసం మన సంస్కృతిని కాపాడే దిశగా ఇది ఒక అర్థవంతమైన అడుగు" అని పేర్కొన్నారు.

జయంత్ అండ్ ది జింగో పెన్' సినిమా నవంబర్ 14న విడుదల

నమో జయం ప్రొడక్షన్స్ బ్యానర్ మీద దివ్య ప్రవీణ్ బొలిశెట్టి నిర్మాణంలో జాతీయ అవార్డు గ్రహీత నవీన్ దేశబోయిన తెరకెక్కించిన చిత్రం 'జయంత్ అండ్ ది జింగో పెన్'. ఈ సినిమాలో మాస్టర్ జయంత్ బొలిశెట్టి, మన శంకర వర ప్రసాద్ ఫేమ్ ఊహా రెడ్డి, సత్యం రాజేష్, ఆశిష్ గాంధీ, మానస రాధాకృష్ణన్, తనికెళ్ల భరణి, కాశీ విశ్వనాథ్, మానిక్ రెడ్డి, అశోక్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. బాలల దినోత్సవం సందర్భంగా ఈ మూవీని నవంబర్ 14న విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో ట్యూన్స్ & లిరిసిస్ట్ ప్రవీణ్ బొలిశెట్టి మాట్లాడుతూ .. "జయంత్ అండ్ ది జింగో పెన్' చిత్రంలో నేను రాసిన పాటలకు మంచి స్పందన వచ్చింది. ఈ మూవీని బాలల దినోత్సవం సందర్భంగా నవంబర్ 14న రిలీజ్ చేస్తున్నాం. పిల్లలు, పేరెంట్స్, టీచర్స్ అందరూ కలిసి తండోపతండాలుగా థియేటర్లు బుక్ చేసుకుంటున్నారు. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా మా చిత్రం ఉంటుంది' అని అన్నారు. మాస్టర్ జయంత్ బొలిశెట్టి మాట్లాడుతూ .. "జయంత్ అండ్ ది జింగో పెన్' సినిమాని చిల్డ్రెన్స్ డే స్పెషల్‌గా రిలీజ్ చేస్తున్నాం. పిల్లల కోసం ఈ మూవీ టికెట్‌ని రూ. 250 నుంచి రూ. 150కి తగ్గించాం. పిల్లలకు, పెద్దలకు, టీచర్లకు మంచి సందేశం ఇచ్చేలా సినిమా ఉంటుంది. మా మూవీ అందరికీ కనెక్ట్ అవుతుంది' అని అన్నారు. నిర్మాత దివ్య ప్రవీణ్ బొలిశెట్టి మాట్లాడుతూ.. "జయంత్ అండ్ ది జింగో పెన్' సినిమాలోని ఎమోషన్స్ అందరికీ కనెక్ట్ అవుతాయి. పిల్లల కోసం టికెట్ రేట్లను



తగ్గించాం. పిల్లలు, తల్లిదండ్రులు, టీచర్స్ అందరూ ఈ మూవీని చూడాలి. బాలల దినోత్సవం సందర్భంగా మా సినిమా రిలీజ్ అవుతోంది. పిల్లల మార్కులు కాదు మనసులు చూడండి' అని అన్నారు. సహ నిర్మాత షఫి మాట్లాడుతూ.. "జయంత్ అండ్ ది జింగో పెన్' చిత్రాన్ని బాలల దినోత్సవం సందర్భంగా రిలీజ్ చేస్తున్నాం. పిల్లలకు కానుకగా ఈ మూవీని విడుదల చేస్తున్నాం. అందుకే రూ. 250 ఉన్న టికెట్‌ని రూ. 150కే అందిస్తున్నాం. అన్ని చోట్లా హౌస్ ఫుల్స్ అవుతున్నాయి. ఈ క్రమంలో వేరే వాళ్లు కూడా చిల్డ్రెన్స్ డే స్పెషల్ అని సినిమాని ప్రమోట్ చేసుకుంటున్నారు. మేం మాత్రం ముందు నుంచే పిల్లల కోసం ఈ మూవీని తీశాం. అందరూ మా సినిమాని నవంబర్ 14న చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. దర్శకుడు నవీన్ దేశబోయిన మాట్లాడుతూ.. "జయంత్ అండ్ ది జింగో పెన్' చిత్రాన్ని బాలల దినోత్సవం సందర్భంగా నవంబర్ 14న రిలీజ్ చేస్తున్నాం. ఈ మూవీని వ్యాపారంగా చూడటం లేదు. అందుకే టికెట్ రేట్లను రూ. 150కి తగ్గించాం. పిల్లలు, పేరెంట్స్, టీచర్స్ అందరూ ఈ సినిమాని చూడాలి. ఇప్పటికే చాలా స్కూల్స్ థియేటర్లను బుక్ చేసుకున్నాయి. ఈ రోజు కావాలనే ఓ సినిమాని చిల్డ్రెన్స్ డే స్పెషల్ అంటూ ప్రమోట్ చేసుకుంటున్నారు. ఆ విషయంలో మీరు పొరబాటు పడకండి. మా 'జయంత్ అండ్ ది జింగో పెన్' సినిమా నవంబర్ 14న రాబోతోంది. అందరూ తప్పకుండా చూడండి' అని అన్నారు.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM